ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY





గురువారం 03 సెప్టెంబర్ 2026 | Thursday 03 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 143 | Vol.No 28 Issue No .143 | www.visionandhra.in

## విజన్ ఆంధ్ర ఎఫెక్ట్ తో
## డూప్లికేట్ డా. మాఫియాలో
# గుబులు..!

- మరో 10 మంది నకిలీ వైద్యుల గుట్టురట్టు. అరెస్ట్
- అర్హత లేకుండానే క్లినిక్‌ల నిర్వహణ
- 10 క్లినిక్‌లపై ఏకకాలంలో దాడులు.. సీజ్
- చిన్నారులకు చికిత్స.. సెలైన్లు ఎక్కించిన వైనం
- స్టెతస్కోప్‌లు, బీపీ మిషన్లు, మందులు స్వాధీనం



పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) : ఎలాంటి గుర్తింపు పొందిన వైద్య విద్యార్హతలు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై సైబరాబాద్ పోలీసులు కొరడా ఝుళిపించారు. సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ), స్థానిక మిగతా 2లో..

## తెలంగాణ విమానాశ్రయాలను
# త్వరగా పూర్తి చేయండి

- కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం రేవంత్ భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 : తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మిగతా 2లో..



## ఇన్వెస్ట్ తెలంగాణలో
# రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

### కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ వినతి



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించ నున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశర చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో–2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు మిగతా 2లో..

## రాష్ట్రపతితో నితిన్ నబిన్ భేటీ



మిగతా 2లో..

## నాపై చర్యలు తీసుకునే ముందు
# రేవంత్ సంగతి చూడండి

- పదేళ్ళు నేనే ముఖ్యమంత్రి అని ఎలా అంటారు
- రెడ్లకో న్యాయం..బిసిలకో న్యాయమా
- ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో కొండా సురేఖ భేటీ
- మీడియా ముందు సంచల వ్యాఖ్యలు



హైదరాబాద్,సెప్టెంబర్2 : నాపై చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌పై సురేఖ డైరెక్ట్ అటాక్ చేశారు. ఢిల్లీలో హైకమాండ్‌ను కలిసిన మిగతా 2లో..

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,సెప్టెంబర్ 2 : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న మిగతా 2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వం
# అన్ని రంగాల్లో విఫలం

- ఎటు చూసినా విధ్వంసం, వికృతం
- జలద్రోహం చేస్తున్న జలగల పాలన
- అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో
- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు
- వెయ్యిరోజుల్లో 4.50లక్షల కోట్ల అప్పులు
- రుణమాఫీ, పెన్షన్లు, ఉద్యోగాలు అన్నీ మోసపూరిత హామీలే
- కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనపై బిఆర్ఎస్ ఛార్జ్‌షీట్
- సిఎం రేవంత్ పాలనపై నిప్పులు కక్కిన కెటిఆర్






హైదరాబాద్,సెప్టెంబర్2 :కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. బుధవారం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో షార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రొమ్యాక్స్, అవినీతి అల్టామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద మిగతా 2లో..



# కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశాం

- రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉన్న అభివృద్ధి వైపుకు
- అప్పుల భారం ఉన్నప్పటికీ ముందుకు వెళుతున్నాం
- వెయ్యి రోజుల పాలన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్ 2 : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే మిగతా 2లో..

## తెలంగాణ చరిత్రను
# తుడిచేస్తున్నారు..

- కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్‌పై బీజేపీ ఫైర్..!
- సెప్టెంబర్ 17ను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



హైదరాబాద్,సెప్టెంబర్ 2 : కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ మూడు పార్టీలు కలిసి హైదరాబాద్, తెలంగాణ అస్తిత్వాన్ని, నిజాం వ్యతిరేక పోరాట చరిత్రను తుడిచివేసే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. తెలంగాణ మిగతా 2లో..

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- మరింత ముదురుతున్న యుద్ధ వాతావరణం, ● అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు, ● పెళ్లి వేడుకపై అమెరికా క్షిపణి దాడి, ● ఐదుగురు మృతి, 50 మందికి గాయాలు, ● ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ సైన్యం ● ప్రతీకారం తీర్చుకుంటాం..., ● అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్!



టెహ్రాన్,సెప్టెంబర్2 : పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది మిగతా 2లో..

# అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది..

- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చాం
- సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తాం
- ఉత్తరాంధ్రను ఉన్నతాంధ్రగా మార్చడమే లక్ష్యం
- అనకాపల్లిబహిరంగ సభలో సిఎం చంద్రబాబు



అనకాపల్లి,సెప్టెంబర్ 2 : ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ, పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి గడ్డపై అడుగుపెట్టాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సాధించిన ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా అనకాపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని, దాని ఫలితమే ఈ జలయజ్ఞమని అన్నారు.గత ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆ దీవెనల ఫలితమే నేడు అనకాపల్లికి గోదావరమ్మను తీసుకురావడం. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మను మార్కాపురానికి తరలించాం. ఈరోజు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరిని మిగతా 2లో..

## అంతుచిక్కని
# ప్రకృతి విలయం

- 1127కి చేరిన వరద మృతుల సంఖ్య
- 4858 మంది కోసం ఇంకా గాలింపు
- డీఎన్‌ఏ టెస్టుల ద్వారా శవాల గుర్తింపు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 : ప్రళయంలా విరుచుకుపడిన వరదలతో నేపాల్‌లో మరణమృదంగం కొనసాగుతోంది. ఊహించని విధంగా సంభవించిన ప్రకృతి విలయానికి అక్కడి ప్రజలు వేల సంఖ్యలో ప్రాణాలు వదిలారు. తాజా లెక్కల ప్రకారం వరద మృతుల సంఖ్య 1127కి చేరిందని అక్కడి అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకూ ఆచూకి దొరకని వారి సంఖ్య కూడా సుమారు 5 వేల మందిపైగా మిగతా 2లో..

## కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశాం

వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

## రాష్ట్రపతితో నితిన్ నబిన్ భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్2 : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్ మర్యాద పూర్వకంగా రాష్ట్రపతిని కలిసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను నితిన్ నబిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈరోజు నేను గౌరవనీయ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారిని మర్యాదపూర్వకంగా కలిశాను. యన సౌమ్య స్వభావం, దేశానికి చేసిన అచంచలమైన సేవ మనకు ఎంతో నేర్పుతాయి. ఆయన మార్గదర్శనం మన దేశం, సమాజం యొక్క ఉన్నతి కోసం అవిశ్రాంతంగా పనిచేయడానికి మనకు నూతన శక్తిని, స్ఫూర్తిని ఇస్తుంది.' అని నితిన్ నబిన్ రాసుకొచ్చారు.

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎసా

## తెలంగాణ విమానాశ్రాయాలను త్వరగా పూర్తి చేయండి

ఇరువురు నేతలు చర్చించారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.ఆదిలాబాద్‌లో రన్ వే ఫైలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామూనురు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. టెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ౹ర‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## అంతుచిక్కని ప్రకృతి విలయం

ఉంటుందని అంచనా వేశారు.నేపాల్ వరదల్లో ఒక్క చిత్వాన్ జిల్లాలోనే అత్యధికంగా అంటే 348 మంది మృతదేహాలను వెలికితీశారు సహాయక బృందాలు. వారితో పాటు మరో 6,541 మందిని ప్రాణాలతో కాపాడి సురక్షిత ప్రదేశాలకు తరలించాయి రెస్క్యూ టీమ్స్. నేపాల్‌లో వరదలతో ఏర్పడిన విధ్వంసానికి సంబంధించిన చేదుజ్ఞాపకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మొదట వెయ్యి మంది వరకు గల్లంతైనట్లుగా భావించిన అధికారులు ..ఇప్పుడు వరదల్లో చిక్కుకొని, గల్లంతైన వారిలో చనిపోయిన వారి సంఖ్యే 12 వందలకు చేరుకుంటోంది. 1127 మంది చనిపోయినట్లుగా నేపాల్ పోలీస్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఇక వరదల్లో గల్లంతై, బురదల్లో చిక్కుకుపోయిన వాళ్ల సంఖ్య కూడా 4858 మంది వరకు ఉన్నారని అక్కడి జనాభా లెక్కల ప్రకారం తెలుస్తోంది. మరీ ముఖ్యంగా చిత్వాన్ జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో మృతదేహాలను వెలికి తీశారు. గత వారం రోజులకుపైగా కొనసాగుతున్న సహాయకచర్యల్లో భాగంగా ఇప్పటి వరకు 348 మృతదేహాలను వెలికితీశారు. నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. ధాడింగ్, గోర్ఖా, రసువా, తనాహుల జిల్లాల్లో కూడా చనిపోయిన వారి సంఖ్యలో వందల్లోనే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారు, గల్లంతైన వారితో పాటు తీవ్రంగా గాయాలపాలైన వాళ్ల కోసం కోసం రెస్క్యూ బృందాలు విస్తృతంగా శ్రమిస్తున్నాయి. 7,912 మంది పోలీసు సిబ్బంది వరదలు సంభవించిన 4 జిల్లాల్లో 6,541 మందిని రెస్క్యూ టీమ్‌లు సురక్షితంగా రక్షించాయి. ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో కేవలం 95 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించి తీసుకెళ్లారని నేపాల్ ప్రధాని బాలెన్ షా తెలిపారు. గుర్తు పట్టలేని విధంగా ఉన్న శవాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించి భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు. నేపాల్‌లో సంభవించిన వరదలు ఆకస్మిక వరదలు మాత్రమే కాదని రాకాసి వరదలుగా చూస్తున్నారు అక్కడి ప్రజలు.

## తెలంగాణ చరిత్రను తుడిచేస్తున్నారు..

విమోచన దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఉన్నంతకాలం తెలంగాణ ప్రజలకు పోరాట చరిత్రను వివరిస్తూనే ఉంటామని.. తాము అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 గొప్పతనాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని ప్రకటించారు. హనుమకొండ జిల్లా పరకాలలో తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరకాలలోని అమరధామం వద్ద రామచందర్ రావు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల ప్రారంభంలో పరకాల అమరధామం వద్ద నివాళు లర్పించే అవకాశం రావడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. 1947లో ఇదే రోజున ఇదే ప్రాంతంలో దక్షిణాది జలియన్ వాలా బాగ్ గా చెప్పుకునే ఘటన చోటుచేసుకుందని రామచందర్ రావు పేర్కొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు గ్రామస్తులు సమావేశమైన సమయంలో రజాకారులు, నిజాం పోలీసులు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని.. ఈ ఘటనలో 22 మంది మరణించగా, పలువురు గాయపడ్డారని తెలిపారు. తెలంగాణ పోరాట చరిత్రలో కీలకమైన ఈ ఘటనను కొన్ని రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా విస్మరించాయని ఆయన ఆరోపించారు. అమరవీరుల త్యాగాలను చరిత్ర నుంచి ఎవరూ చెరిపివేయలేరని రామచందర్ రావు అన్నారు. త్రివర్ణ పతాకం కోసం వారు ప్రదర్శించిన ధైర్యం, చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. నిజాం వ్యతిరేక పోరాటానికి ప్రేరణ ఇచ్చిన వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ పార్టీ అవమానపరుస్తోందని విమర్శించారు. సెప్టెంబర్ 17న తెలంగాణలోని ప్రతి గ్రామంలో విద్యార్థులు, యువత, ప్రజలు వందేమాతరం గీతాన్ని ఆలపించాలని పిలుపునిచ్చారు. ఇక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదని రామచందర్ రావు ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీకి భయపడే కారణంగానే ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇది కేవలం ఒక రాజకీయ అంశం కాదని.. తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో పాటు, తెలంగాణ పోరాట చరిత్రకు సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని స్పష్టం చేశారు.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్టు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్టు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు. ఇరాన్ దళాల లాగా తాము సామాన్య పౌరులను ఏనాడు టా÷-గ్గ్÷ట్ చేయలేదని స్పష్టం చేశారు. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ కౌంటీలో ఉన్న కుహెస్తక్ నగరంలో ఘోరం జరిగింది. ఒక నివాస గృహంలో జరుగుతున్న పెళ్లి వేడుకపై అమెరికా సేనలు క్షిపణితో దాడి చేశాయి. ఈ భయంకరమైన దాడిలో ఒక చిన్నారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఇరాన్ రెడ్ క్రెసెంట్ ప్రకటించింది. ఈ దారుణ ఘటనపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇదొక అత్యంత క్రూరమైన నేరమని అభివర్ణించింది. అమెరికా చేసిన ఈ దారుణ కాండకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. అమాయకులైన పౌరులపై జరుగుతున్న ఈ దాడులను చూస్తూ అంతర్జాతీయ సమాజం మౌనం వహించడం అత్యంత ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మౌనంగా ఉన్న దేశాలు రేపు తమ వంతు వచ్చినప్పుడు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని బఘాయి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ళ్లి జరుగుతున్న ఇల్లు అమెరికా క్షిపణి శకలాలు తగలడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. ఇల్లంతా శిథిలాల మయంగా మారిన ఆ వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. అయితే సిరిక్ కౌంటీలో ఏ లక్ష్యాన్ని ఛేదించేందుకు అమెరికా ఈ దాడి చేసిందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. పెళ్లి వేడుకపై జరిగిన ఈ దాడికి సంబంధించి అమెరికా ప్రభుత్వం గానీ, సైన్యం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అమాయకుల ప్రాణాలు తీసిన అమెరికాపై ఇరాన్ ఇప్పటికే ప్రతీకార దాడులు ప్రారంభించింది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్ దేశాల్లో ఉన్న అమెరికా అనుబంధ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ బలగాలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో, దక్షిణ ఇరాన్ పరిసరాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కొన్ని నెలలుగా అమెరికా, ఇరాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులు పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. అమెరికా దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ దీటుగా బదులిస్తామని ఇరాన్ పదేపదే హెచ్చరిస్తోంది. మరోవైపు ఇరాన్ గనక మరిన్ని దాడులకు పాల్పడితే తీవ్రమైన సైనిక చర్యలు తప్పవని వాషింగ్టన్ కౌంటర్ వార్నింగ్ ఇస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో పెను యుద్ధానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. ఢిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఎంగిలి విస్తరాకుల దగ్గర కుక్కలు కొట్టుకున్నట్లు.. రాష్ట్ర సంపాదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారు. ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్వచించరు. జల ద్రోహం చేస్తున్న జలగల పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు చంచాగిరి చేస్తూ గురువుగారికి దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెప్పారు. వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారన్నారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్కు డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్ఏ నోరు తెరువదు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోచేయి నీళ్లు తాగే అధికారి ఆదిత్య నాద్ దాస్ ను సలహాదా రుగా పెడితే తెలంగాణకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారు. రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని రూ.20 కోట్లతో ముగించారని మండిపడ్డారు. నీళ్లు అడిగితే కోసి రక్తం చల్లమన్నారు. యూరియా అడిగిన రైతులపై లాఠీ చార్జి చేశారు. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష, మోటర్లుకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు బందు అయింది. రాహుల్ బంధ్ చాలయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నర కోట్ల అప్పు చేశారు. రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడున్నది అచ్చ కాంగ్రెస్ కాదు, పచ్చ కాంగ్రెస్ కాదు, లుచ్చ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో అసలైన కాంగ్రెస్ లేదని తెలంగాణ సమాజాం అనుకుంటుందన్నారు. మొదటి నుంచి వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి అందలం ఎక్కించార న్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని విస్మరించారన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్శించారు.

## అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది..

అనకాపల్లికి తీసుకొచ్చాం. ఇది ఒక చారిత్రక ఘట్టం" అని ఆయన అన్నారు. హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు తూర్పు కనుమలు, అడవులు, వాగులను దాటుకుని తరలివస్తున్న గోదావరి జలాలను చూసి ఎంతో సంతృప్తి కలిగిందని తెలిపారు. "అనకాపల్లి బెల్లం ఎంత తీయగా ఉంటుందో, ఈ రోజు అంతే తీయగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ జల ప్రవాహం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది సింహాద్రి అప్పన్న చెంతకు, ఆ తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాదాల చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లి వంశధార నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "గలగల గోదావరి, బిరబిరా కృష్ణమ్మ అని పాటల్లో విన్నాం. ఇప్పుడు దానిని నిజం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ జల విజయం ప్రజల విజయం," అని ఆయన అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ ప్రాజెక్టును అనుసంధానించి 12 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ. 3,200 కోట్లు ఖర్చు చేస్తామని, 2028 నాటికి వాటిని జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019 నాటికి మేము పోలవరం పనులను 72% పూర్తి చేశాం. కానీ తర్వాత వచ్చిన గడ్డలి పార్టీ నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు గోదావరి పాలయ్యే పరిస్థితికి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఆ నాయకుడు, తన నివాసం కోసం రుషికొండలో ప్యాలెస్‌కు రూ. 500 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బుతో నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయ్యేవి" అని ఆయన ఆరోపించారు. విశాఖకు డేటా సెంటర్ వస్తే నీరు, విద్యుత్ కొరత వస్తుందని ఇప్పుడు పేటీఎం బ్యాచ్‌తో ప్రచారం చేయిస్తున్నారని, కానీ ఐదు డేటా సెంటర్లకు అవసరమైన దానికంటే వందల రెట్లు ఎక్కువ నీటిని ఇచ్చే శక్తి తమకుందని స్పష్టం చేశారు. భోగాపురం, వెలిగొండలాగే ఈ ప్రాజెక్టు క్రెడిట్‌ను కూడా దొంగిలించేందుకు గత పాలకులు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. జలం ఉంటేనే జీవం, జీవితం," అని చంద్రబాబు అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని కేటాయిస్తామని వివరించారు. అదానీ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, ఫార్మా వంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు. "ఒకప్పుడు హైదరాబాద్ పక్కన రంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందిందో, రేపు అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు వస్తారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా, ఉన్నతాంధ్రగా మారుతుంది. ఇది ఖాయం, రాసిపెట్టుకోండి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ, పురుషోత్తపట్నం ద్వారా నదుల అనుసంధానం చేశానని, ఇప్పుడు అనకాపల్లికి నీరు తెచ్చానని, రాబోయే మూడేళ్లలో రూ. 35,000 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. "పాలకులం కాదు, మీకు సేవకులం. పదవి అంటే పెత్తనం కాదు, జవాబుదారితనం. మాకు అహంకారం లేదు, అంకితభావం ఉంది" అని అన్నారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'తో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## విజన్ ఆంధ్ర ఎఫెక్ట్ తో
### డూప్లికేట్ డా. మాఫియాలో
# గుబులు..!

పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో 10 మంది నకిలీ వైద్యులను అరెస్టు చేసి, వారి ఆధ్వర్యంలోని 10 క్లినిక్‌లను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి ఈ వివరాలనుజీ వెల్లడించారు. మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో నకిలీ వైద్యులు క్లినిక్‌లు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టినట్లు తెలిపారు.

**వైద్య డిగ్రీలు లేకుండానే వైద్యం**

అరెస్టయిన వారిలో కొందరు ఇంటర్మీడియట్ చదివిన వారు కాగా, మరికొందరు బీకాం, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ వంటి కోర్సులు చదివినవారున్నారని పోలీసులు తెలిపారు. గుర్తింపు పొందిన వైద్య విద్యను అభ్యసించకపోయినా వైద్యులుగా చలామణి అవుతూ ప్రజలకు చికిత్స అందిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అరెస్టయిన వారిని లిలివి. బుచ్చయ్య (35), ఎం. సుధాకర్ చారి (61), డి. అంజ గౌడ్ (49), రామావత్ ప్రకాష్ (26), మేకల అక్షయ్ కుమార్ (35), కె. నారాయణ (50), జి. ప్రహ్లాద్ (55), కొనపాల బుచ్చి బాబు (50), ఎస్. శ్రీనివాసరావు (47), పి. గంగారామ్ (55)లిలిగా పోలీసులు గుర్తించారు.

**చిన్నారులకు సైతం చికిత్స**

నిందితులు సాధారణ అనారోగ్యాలకు చికిత్స అందించడంతో పాటు చిన్న పిల్లలకు కూడా వైద్యం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని క్లినిక్‌లలో బెడ్‌లు ఏర్పాటు చేసి రోగులను అడ్మిట్ చేసుకోవడంతో పాటు, సరైన వైద్య పరిజ్ఞానం లేకుండానే సెలైన్లు, ఐవీ ద్రవాలు ఎక్కిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. ఇలాంటి నిర్లక్ష్య వైద్యం వల్ల రోగుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

**క్లినిక్‌ల నుంచి వైద్య పరికరాలు స్వాధీనం**

దాడుల సందర్భంగా నకిలీ వైద్యులు నిర్వహిస్తున్న క్లినిక్‌ల నుంచి 9 స్టెతస్కోప్‌లు, 9 బీపీ మిషన్లు, 6 థర్మామీటర్లు, పల్స్ ఆక్సిమీటర్, బరువు కొలిచే యంత్రం, షుగర్ పరీక్షించే పరికరం, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్‌లు, కాలం చెల్లిన మందులు, సిరంజీలు, సెలైన్ బాటిళ్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

**ఎనిమిది పోలీస్‌స్టేషన్లలో కేసులు**

ఈ వ్యవహారానికి సంబంధించి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. పేట్‌బషీరాబాద్, జగద్గిరిగుట్ట, సూరారం, బాచుపల్లి, ఆర్‌సీ పురం, ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్లలో ఒక్కో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**డాక్టర్ అర్హతలు పరిశీలించండి**

వైద్యం కోసం క్లినిక్‌కు వెళ్లే ముందు అక్కడ చికిత్స అందిస్తున్న వ్యక్తి వైద్య విద్యార్హతలు, వైద్యుల రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలించాలని డీసీపీ కోటిరెడ్డి ప్రజలకు సూచించారు. అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొందడం ద్వారా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. తమ పరిసరాల్లో నకిలీ వైద్యులు, అనధికారిక క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.

## నాపై చర్యలు తీసుకునే ముందు రేవంత్ సంగతి చూడండి

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పదేళ్లు సీఎం అని తనే చెప్పుకుంటున్నాడు. అది ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఇతర శాఖ మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. సీఎంపై మంత్రులు, నేతలు కూడా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనని రాజీనామా చేయమని, మరొకటిగాని నాకు ఎవరు చెప్పలేదు. హైకమాండ్‌కు రాతపూర్వకంగా అన్ని వివరాలు తెలియజేశానని తెలిపారు. నా బిడ్డ మాట్లాడితే నాకెందుకు శిక్ష వేస్తారు. రెడ్లలో ఎంతో మంది అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. బీసీకి ఒక న్యాయం ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. అంతా సద్దుమణిగింది అనుకునే తరుణంలో సురేఖ వ్యాఖ్యల అంతరార్ధం ఏటంటనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. ఢిల్లీలో రాజీ మంత్రం బెడిసికొట్టడం వల్లే ఆమె ఇలా మాట్లాడుతుందే మోనని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. మరోవైపు సురేఖపై అధిష్ఠానానికి సీఎం నివేదికను అందజేశారు. సాధ్యమైనంత త్వరగా ఆమె చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈరోజే కొండా సరేఖపై హైకమాండ్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ




ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు

# సంపాదకీయం

## ఉగ్రవాదంపై పాక్‌కు మరోమారు హెచ్చరిక !

సింధుజలాలపై గొంతు చించుకున్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉగ్రవాదంపై ఒక్కమాటా మాట్లాడ లేదు. రాజకీయాలకు నదీజలాలను వాడుకోవడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ. సింధూజలాలు ఆపడం వల్ల పాక్‌లో రైతులు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్ సిందూ జలాలను పాక్‌కు నిలిపివేయడంపై కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రస్తావించారు. అయితే తమదేశం ఉగ్రవాదనికి మద్దతు ఇవ్వదని ఒక్కమాటా చెప్పలేదు. అయితే ఇదే సందర్భంలో మోడీ పాక్‌పై ఎదురుదాడి చేశారు. ప్రధాని మోడీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు అని మోడీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఓ రకంగా షెహబాజ్‌కు ఇది ఓ హెచ్చరికల లాంటిది. ఎస్‌సీవో దేశాధినేతలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, వారికి మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలకు అంతర్జాతీయ సమాజం నుంచి గట్టి హెచ్చరిక వెళ్లాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదనే విషయాన్ని మనమంతా ఒకే గొంతుతో చెప్పాలి. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదనే బలమైన సందేశం ఇవ్వాలని మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై మోడీ భారత్ గళాన్ని గట్టిగా వినిపించారు. ఇది ఓ రకంగా చెప్పాలంటే హెహబాజ్‌కు సూటిగా తగిలివుంటుంది. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపై దేశాలు కలిసి పనిచేయాలని సూచించారు. 2025లో జరిగిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోడీ తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదంపై భారత్ వైఖరిని మోడీ మరోసారి స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోడీ అన్నారు. అయితే ఇలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు. బిష్కెక్‌లో జరిగిన ఈ సమావేశానికి మోడీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్–జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రహ్మాన్ తదితరులు హాజరయ్యారు.పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశాలతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి.ఈ సదస్సు ద్వారా భారత్ ఎప్పటికప్పుడు ఉగ్రవాదంపై హెచ్చరిస్తూనే ఉంది. ఉగ్రవాదం ప్రపంచాన్ని తుడిచిపెట్టే మహమ్మారి అని కూడా హెచ్చరించారు. పాక్ ఇలాంటి నీతలకు లొంగి వైఖరి మార్చుకుం టుందని అనుకోవడం పొరపాటు. అక్కడ ఉగ్రవాదులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. అందువల్ల పాక్‌ను ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు రాదు.

## క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు స్క్రీనింగ్ చేయించుకోవాలి: ఎం.పి. డి. కె అరుణ

### మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించ వద్దు
### తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స:జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి




మహబూబ్ నగర్ ఆగస్ట్ 2(విజన్ ఆంధ్ర)క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందని మహబూబ్‌నగర్ ఎం.పి డి.కె అరుణ అన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.బాలానగర్ మండలంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎం.పి డి.కె అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎం.పి డి.కె అరుణ మాట్లాడుతూ కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమై ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపారు. తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రాఆకే) పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. స్క్రీనింగ్‌లో అనుమానిత కేసులను గుర్తించి, వారికి తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాలు, ఉచిత లేదా తక్కువ ఖర్చుతో లభించే వైద్య సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు.మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వారం తదితర క్యాన్సర్ల లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని, ఆరోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాలికలకు హెచ్‌పీవీ టీకాపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని కోరారు.'ఇంట్లో తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది' అని పేర్కొన్న ఎంపీ, ప్రతి ఒక్కరూ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.లిజిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ, మహిళలు కుటుంబ బాధ్యతలు వల్ల తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు అన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.అందువల్ల మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మహిళలందరికీ ఇటువంటి స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ఎంపీ డీకే అరుణకు, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఫౌండేషన్‌కు జిల్లా యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి మహిళలు పూర్తి సహకారం అందించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సహకారంతోనే కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు.స్క్రీనింగ్ అనంతరం క్యాన్సర్ అనుమానం ఉన్నవారిని అవసరమైన తదుపరి పరీక్షలు, చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయడంతో పాటు, వారి చికిత్స ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (ప్రాఆకే) వైద్యులు ప్రతి కేసును సున్నితంగా పరిగణించి, స్క్రీనింగ్ తర్వాత అవసరమైన తృతీయ స్థాయి చికిత్స అందేలా ఫాలోఅప్ చేయాలని సూచించారు.స్క్రీనింగ్‌లో గుర్తించిన కేసులపై ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించి, సంబంధిత మహిళలు ఎక్కడ చికిత్స పొందుతున్నారు, వారికి ఎలాంటి వైద్య సహాయం అవసరమవుతోంది అనే వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థలు, వైద్యులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ ఏ.శ్రీనివాసులులి మాట్లాడుతూ, జిల్లాలో 850 మంది ఆశా కార్యకర్తల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.14 ఏళ్లలోపు పిల్లలకు హ్యూఎ వ్యాక్సిన్ అందించడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని, అవసరమైన పరీక్షలను అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం అందిస్తున్న క్యాన్సర్ నివారణ, స్క్రీనింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్ వల్లే ఓ నిండు ప్రాణం నిలబడింది

### వైద్య దంపతులు ఎగ్గెన శ్రీనివాస్,సునీత




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 02,(విజన్ ఆంధ్ర)ఇటీవల ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనం నడుపుతూ ఒక్కసారిగా కిందపడిపోయాడు. స్థానికులు సమీపంలో నివాసం ఉంటున్న వైద్యులు ఎగ్గెన శ్రీనివాస్ సునీత దంపతులకు తెలియజేయడం తో అక్కడికి చేరుకొని ఆ వ్యక్తి ఆపస్మారక స్థితిలో ఉండటం గమనించి వెంటనే సిపిఆర్ చేశారు. దీంతో స్పృహలో వచ్చిన ఆ వ్యక్తిని హుటాహుటిన ఆటోలో చికిత్స నిమిత్తం ఆసుపత్రి కి తరలించారు.ఆ వ్యక్తి చికిత్స పొందిన అనంతరం మళ్ళీ మాములు స్థితికిరావడం తో కుటుంబ సభ్యులు వైద్య దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఏయిమ్స్ ఆసుపత్రి వైద్యులు ఎగ్గెన శ్రీనివాస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.గుండె ఆగినప్పుడు ఆశా ఆగిపోకూడదని తెలిపారు. మన చుట్టూ ఎక్కడైన ఒక వ్యక్తి ఆకస్మాత్తుగ కుప్పకూలినప్పుడు వెంటనే పరిస్థితి గమనించి అంబులెన్సు వచ్చే వరకు వేచి చూడకుండా ఆ వ్యక్తికీ సిపిఆర్ చేయాలని, సిపిఆర్ చేయడం తెలుసుకోవాలని, అప్పుడు రెండు చేతులు ఒక ప్రాణాన్ని నిలబెట్టే చేతులుగా మారవచ్చు అని అన్నారు.**వైద్య దంపతులకు సన్మానం...**సిపిఆర్ చేసి ఒక ప్రాణం కాపాడిన వైద్య దంపతులను బీజేపీ కార్పొరేటర్లు గాజుల ముఖేష్ గౌడ్ నాగరాజు, బోట్ల అనిత సత్యం బుధవారం ఆసుపత్రి లో శాలువాతో సన్మానించారు.

## ఎస్ఐఆర్ నోటీసుల హియరింగ్, పరిష్కారం ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 2,( విజన్ ఆంధ్ర ):జిల్లాలోఎస్ఐఆర్ నోటీసుల హియరింగ్ ప్రక్రియను చాలా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ నోటీసుల హియరింగ్ ప్రక్రియలో భాగంగా బుధవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని బండ్లగూడ, హైదర్‌షాకోట్, శివరాంపల్లి ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి పరిశీలించారు. రంగారెడ్డి జిల్లాలో ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. జిల్లాలో వ్రాసిన తర్వాత తుడ్పకుండా, క్రమ రాహిత్యాలు కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని ఆయన సూచించారు. సంబంధిత పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన మరియు ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శేరిలింగంపల్లి జోన్‌లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి స్థానిక సంస్థల అదన కలెక్టర్ మధుసూదన్ నాయక్.




మహబూబ్ నగర్ ఆగస్ట్ 2(విజన్ ఆంధ్ర)జి ల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (ఖ+దీఎ) విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హాస్టల్ సంక్షేమ అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఖ+దీఎ ప్రత్యేక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుధ్యం, ఆరోగ్యం, విద్యాబోధన, భద్రతా చర్యలపై సమీక్షించారు.వసతి గృహాలు, పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్త, పిచ్చిమొక్కలు, పొదలు తొలగించి పాములు, విషపురుగులు సంచరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన ఏ సమస్య తలెత్తినా వెంటనే స్పందించి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఖ+దీఎల్లో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధికారులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించేలా వారానికి ఒకసారి మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్లిప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచాలని తెలిపారు. ఆంగ్ల భాషపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ ఆంగ్ల పాఠాలు ప్రారంభించే ముందు 10 నుంచి 15 నిమిషాల పాటు ప్రాథమిక వ్యాకరణ అంశాలను బోధించాలని సూచించారు. విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడే అవకాశాలు కల్పించాలని అన్నారు.విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, నెలకు ఒకసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ధికారులు 15 రోజులకు కనీసం ఒకసారి తమ పరిధిలోని వసతి గృహాలు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో బసచేసి పరిస్థితులను పరిశీలించాలని అదనపు కలెక్టర్ కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును అధికారులపై నమ్మకంతో అప్పగిస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి సునీత, బి.సి సంక్షేమ అభివృద్ధి సంస్థ అధికారి విష్ణు నందన్, జి.సి.డి.ఓ ఆశ్ర ఖాద్రి, హాస్టల్ వెల్ఫేర్ ఆధికారులు, కె. జి. బి. వి ప్రత్యేక అధికారులు, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట్‌లో మున్సిపల్ కమిషనర్ విస్తృత తనిఖీ

### పారిశుధ్యం, రోడ్లు, పార్కుల నిర్వహణపై అధికారులకు కీలక ఆదేశాలు



మల్కాజిగిరి జిల్లా,సెప్టెంబర్02(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొత్తపేట్ వార్డులో కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం విస్తృతంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు.ఈ సంధర్బంగా డీప్యూటి కమిషనర్,అధికారులు,సిబ్బందితో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ,ఎస్ఏటీ వాహనాల ద్వారా చెత్త సేకరణ, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల తొలగింపు, రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లు, ప్లాంటర్ బాక్సులు, కాలనీ పార్కు నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ప్రతి ఇంటిని, వాణిజ్య సంస్థను ఎస్ఏటీ ఆటోల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ వ్యవస్థకు అనుసంధానం చేసి వంద శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. రోడ్డు మార్జిన్లు, బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రోడ్ల పక్కన, మార్జిన్లపై పేరుకుపోయిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను వెంటనే తొలగించి అధీకృత సీ అండ్ డీ వ్యర్థాల శుద్ధి కేంద్రానికి తరలించాలని రామ్‌కీ, ఈపీటీఆర్ఐ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో రోడ్లు, మార్జిన్లపై వ్యర్థాలు డంప్ కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ప్రజల రాకపోకలకు, వాహనాల సాఫీ ప్రయాణానికి ఆటంకంగా ఉన్న అనవసర వస్తువులు, నిర్మాణ సామగ్రి, ఇతర అడ్డంకులను రోడ్లు, ఫుట్‌పాత్‌లు, మార్జిన్ల నుంచి వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా రహదారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న ప్లాంటర్ బాక్సుల్లో తగిన మొక్కలు నాటి వాటికి నిరంతరం నీటి సరఫరా, సంరక్షణ చేపట్టాలని అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను ఆదేశించారు. ఇరుకైన రోడ్లపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్న ప్లాంటర్ బాక్సులను అవసరమైన ప్రాంతాల్లో తొలగించాలని సూచించారు.కొత్తపేట్‌లోని కాలనీ పార్కును కూడా కమిషనర్ పరిశీలించారు. పార్కులో పరిశుభ్రత, పచ్చదనం, మొక్కల సంరక్షణ, సమగ్ర నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. కాలనీ ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, యువతకు ఉపయోగపడేలా చిన్నారుల ఆటస్థలం, ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పచ్చదనం, పార్కులు, ప్రజా ప్రదేశాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన, పచ్చని, సురక్షితమైన, సౌకర్యవంతమైన పట్టణ వాతావరణం కల్పించేలా క్షేత్రస్థాయిలో వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్,అసిస్టెంట్ ఇంజినీర్, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, రామ్‌కీ, ఈపీటీఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకే!

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష
### కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక



కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర )మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి కొత్తగూడెం న్యాయస్థానం రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు నిర్వహించిన విస్తృత తనిఖీల్లో భాగంగా ఈ కేసులు నమోదయ్యాయి. కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో జబ్బా సాగర్, జాతోత్ సురేష్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులపై కొత్తగూడెం 2వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి రవికుమార్ విచారణ చేపట్టి, ఇద్దరు నిందితులకు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.**మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు**ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులతో పాటు అమాయక ప్రజల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పు ఏర్పడుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. వాహనదారులు బాధ్యతగా వ్యవహరించి, మద్యం సేవించిన అనంతరం వాహనాలు నడపకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# గ్రామాల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

## లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లాలోని గ్రామాల భూముల రీసర్వే ప్రక్రియను కచ్చితత్వంతో, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సర్వే అధికారులను ఆదేశించారు.బుధవారం గద్వాల పట్టణ శివారులోని సంగాల గ్రామపంచాయతీకి సంబంధించిన రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను కచ్చితంగా గుర్తించి డీమార్కేషన్ చేయాలని సూచించారు. సరిహద్దుల నిర్ధారణకు అందుబాటులో ఉన్న పాత రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు. అనంతరం సర్వే నంబర్ల వారీగా భూములను గుర్తించి పార్సిళ్లుగా రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూములు, రహదారులు, గ్రామకంఠం, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, గట్లు, తదితరాలను ప్రత్యేకంగా గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను ఆధారంగా తీసుకుని క్షేత్రస్థాయిలో భౌతిక పరిస్థితులతో సరిపోల్చాలని సూచించారు. రీసర్వేలో రోవర్, జీపీఎస్, తదితర సాంకేతిక పరికరాలను సక్రమంగా వినియోగించాలని తెలిపారు. సర్వే సమయంలో ప్రతి పాయింట్‌కు సంబంధించిన భౌగోళిక వివరాలు కచ్చితంగా నమోదు అయ్యేలా చూడాలన్నారు. పాయింట్లను నమోదు చేసే సమయంలో అవసరమైన సమయం తీసుకుని సిగ్నల్ స్థిరంగా వచ్చిన తర్వాతే తుది పాయింట్‌ను నిర్ధారించాలన్నారు. గ్రామంలో ప్రైవేట్ భూముల సర్వే చేపట్టే తేదీని ముందుగానే సంబంధిత రైతులకు తెలియజేయాలని సూచించారు. సంబంధిత రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల సహకారంతో సర్వే పనులను వేగంగా, వివాదాలకు తావులేకుండా పూర్తి చేయవచ్చున్నారు. రికార్డుల్లో ఉన్న వ్యక్తి, క్షేత్రస్థాయిలో భూమిని అనుభవిస్తున్న వ్యక్తి వేర్వేరుగా ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. వారికి తమ ఆధారాలు, అభ్యంతరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించి, నిర్ణీత గడువులోగా వాటిని పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే జీపీఎస్, సర్వే తదితర అంశాల్లో శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్లు అందుబాటులో ఉన్నందున వారిని రీసర్వే పనుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. కేటాయించిన సిబ్బంది పనిలో పూర్తిస్థాయిలో పాల్గొనేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందికి మెమోలు, షోకాజ్ నోటీసులు ఇస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# యూత్ కాంగ్రెస్ ఆద్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

సూర్యాపేట సెప్టెంబర్ 02:(విజన్ ఆంధ్ర)జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు అంజద్ ఆలి, ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని అన్నారు. అందరికీ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని, 108 అంబులెన్స్ లు కూడా వైఎస్ఆర్ హయాంలోనే మొదలైనాయని వారు అన్నారు. దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సూర్యపేట నియోజకవర్గంలో ఆరువేల ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వారు అన్నారు. గత పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని వారు విమర్శించారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి, రైతులకు ఉచిత కరెంటు అమలు చేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతమల్ల రమేష్, కౌన్సిలర్లు నాగుల వాసు, చిలుముల సునీల్ రెడ్డి, గుణగంటి సతీష్,పారుక్,రాపర్తి శ్రీనివాస్, బండారు వెంకన్న , అనంతుల యాదగిరి, పంతంగి దశరథ,బైరు వెంకన్న, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి,దివ్య, నీడ్స్ సాజిద్ , సత్యనారాయణ రెడ్డి, పిడమర్తి శంకర్, నరేందర్ నాయుడు యూత్ కాంగ్రెస్ నాయకులు సమీర్, సుధీర్, అనిల్ ,శివ , అశోక్ , పవన్, వినయ్, మహేష్, లక్ష్మణ్, వంశీ, శివమణి, డి శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం

## -మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యక్రమాలు అమలు

## -సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ :02(విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తోందని సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె సంగారెడ్డిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల పాలనను పూర్తి చేసుకుందన్నారు. ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. మరో రెండేళ్లలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యత చేపట్టిన రెండు రోజుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించారన్నారు. మహిళలను కోటేశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాకుండా మహిళలను బస్సులకు యజమానులుగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పెట్రోల్ బంకుల నిర్వహణ, పావలా వడ్డీ రుణాలు తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ చీరలను మహిళలు ఎంతో సంతోషంగా స్వీకరిస్తున్నారని తెలిపారు.రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సన్న బియ్యం పండించిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని పరిస్థితి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటికి పైగా రేషన్ కార్డులు మంజూరు చేసి పేదలకు ఆహార భద్రత కల్పించిందని ఆమె తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువయ్యాయని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని నిరుపేదల కలను సాకారం చేస్తున్నామని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. పేద కుటుంబాలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని తెలిపారు.విద్యారంగంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అదేవిధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. వైద్య సహాయం కోసం గత ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఎల్‌ఓసీ అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుందని వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం ఎన్నికల హామీలుగా కాకుండా బాధ్యతగా భావించి అమలు చేస్తోందని ఆమె అన్నారు. రానున్న రెండేళ్లలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆర్. కిరణ్ గౌడ్, సీనియర్ నాయకుడు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి మొక్కలను తోబుట్టువుల కాపాడాలి

## -విరివిగా మన ప్రదేశాల్లో మొక్కలను పెంచాలి

## -నారాయణపేట డీఈఓ గోవిందరాజులు



నారాయణపేట, సెప్టెంబర్ 2(విజన్ ఆంధ్ర)పర్యావరణ పరిరక్షణ నిజమైన విద్య అని నారాయణపేట జిల్లా విద్యాధికారి గోవిందరాజు అన్నారు. నారాయణపేట జిల్లా లోని జిల్లాస్థాయి ప్రభుత్వ పాఠశాలల లీడ్ ఎర్త్ లీడర్స్ కు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో బుధవారం ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ ప్రముఖ పర్యావరణ సంస్థ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన లీడ్ ఎర్త్ లీడర్స్ కోసం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యంత ఉత్సాహంగా ప్రారంభించడం సంతోషకర విషయం అన్నారు. చదువు అంటే కేవలం పాఠ్యపుస్తకాలు చదవడం, మార్కులు తెచ్చుకోవడం మాత్రమే కాదు. మనం నివసిస్తున్న భూమిని, ప్రకృతిని కాపాడుకోవడం కూడా నిజమైన విద్యలో భాగం అని స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఎర్త్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి ఒక చెట్టును నాటి, దానిని తన తోబుట్టువులా కాపాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత పాఠశాలలు, నీటి సంరక్షణ, పరిశుభ్రత వంటి అంశాలలో విద్యార్థులే రాయబారులుగా మారాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు విద్యా శాఖ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం ప్రొఫెసర్ ఎన్. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూఎస్ సి ఈ ఆర్ టి రిటైర్డ్ ప్రొఫెసర్, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఎన్. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో వాతావరణ మార్పుల వల్ల అత్యధికంగా నష్టపోయేది నేటి పిల్లలే. అందుకే పిల్లలే లీడ్ ఎర్త్ లీడర్స్ గా మారాలన్నారు.భూమిని నడిపించే నాయకులు కావాలి అని అన్నారు. విద్యార్థులు కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా, ప్రకృతితో అనుసంధానం కావాలన్నారు. వాతావరణ అక్షరాస్యతను పాఠ్యాంశాల్లో భాగం చేయాలని, ప్రతి పాఠశాల ఒక జీవవైవిధ్య పార్కుగా, ప్రయోగశాలగా మారాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నించడం, పరిశీలించడం, పరిష్కారం చూపడం నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ భాను ప్రకాష్, ఏ ఎం ఓ విద్యాసాగర్. సెక్టోరియల్ అధికారి నాగార్జున రెడ్డి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ డా. ఎ. నటరాజ్, లయన్స్ క్లబ్ ఆఫ్ పాలమూర్ అధ్యక్షులు లయన్ డా. సి. బాబుల్ రెడ్డి, సి జి ఆర్ వ్యవస్థాపకులు కె. లక్ష్మారెడ్డి, పుడమి పత్రిక సంపాదకులు రమేష్ రావు,నారాయణపేట డిడిఏం మహేందర్, జాజాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు వార్ల మల్లేశం జనార్ధన్ రెడ్డి సాకా రవి సత్యనారాయణ రెడ్డి నరసింహ నర్సింలు నిర్మల స్వప్న తదితరులు ప్రసంగించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 20 మంది ఉపాధ్యాయులు, 160 మంది ఎర్త్ లీడర్లు (విద్యార్థులు) సి జి ఆర్ సంస్థ ప్రతినిధులు పర్యావరణ శాస్త్రవేత ఉమా మహేశ్వర్ రెడ్డి, ఇంచార్జి నగేష్, జిల్లా కోఆర్డినేటర్స్ మద్దిలేటి,హన్మంతు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు

## జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 2, (విజన్ ఆంధ్ర ): రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గ్, చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం నాడు ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, సిబ్బంది విధుల నిర్వహణ, మందుల నిల్వలు, ల్యాబొరేటరీ సేవలు, ప్రసవ సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆమె ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రిలో పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి సూచించారు.

# గత ప్రభుత్వంలో నోచుకోని అభివృద్ధి పనులకు... కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్రీకారం



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర)వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తున్నానని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 14వ డివిజన్లోని ఇందిరమ్మ కాలనీలో 90లక్షల విలువ సీసీ రోడ్లు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ...గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నామన్నారు.డివిజన్లో మిగిలిన పనులకు కూడా దశల వారీగా పనులకు శ్రీకారం చేపడతామన్నారు.రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మేయర్ అన్నారు.డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.స్థానిక మహిళలు బస్సు సౌకర్యం కావాలని ఎమ్మెల్యే గారికి కోరడంతో తక్షణమే అధికారులతో ఫోన్లో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారు.అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షులు ఇంతియాజ్,మాజీ కార్పొరేటర్ సులోచన సారయ్య,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు,సీనియర్ నాయకులు స్టాలిన్,సంతోష్,రాజేందర్, భాష, జాయకర్,షజాదీ, రవి,శంకర్,రాజేష్,కుమార్,డివిజన్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వము

**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**

**కలెక్టరేట్ :: మహబూబ్‌నగర్**

నెం. Rev/G1/LAG/0006/2026-G-Section తేది: 28-07-2026

[illegible]

**ఫారం - VII**

**రూఢి ప్రకటన**

[illegible]

**షెడ్యూల్**

గ్రామము: మద్దిగట్ల మండలం: భూత్పూర్ జిల్లా: మహబూబ్‌నగర్

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 444 | మెట్ట | పట్టా | 0.16½ | [illegible] | 534 | VB | 445 | 450 | - | - |
| మొత్తం | | | | 0.16½ | | | | | | | |

[illegible]

సం/- సం/-

ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, యూనిట్ - II, మహబూబ్‌నగర్ | అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహబూబ్‌నగర్ | ఖుష్బూ గుప్తా, IAS జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్

DIPR RO NO.802-LA/PP/ADVT/PUB/ 2026-27 తేది 02-09-2026

# టీఐసీసీఐ మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్తగా, ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్‌చార్జిగా డా. ధరంసోతు సీతారాం నాయక్ నియామకం




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర):మహబూబాబాద్: గిరిజన పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, యువత, మహిళా పారిశ్రామికవేత్తలు మరియు స్వయం ఉపాధి రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ɾ×జజ×) ▪ తెలంగాణ చాప్టర్లో డా. ధరంసోతు సీతారాం నాయక్ ను మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్తగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు జిల్లాలకు ఇన్‌చార్జిగా నియమించినట్లు టీఐసీసీఐ తెలంగాణ చాప్టర్ అధ్యక్షులు డా. ధరావత్ శ్రీనివాస్ తెలిపారు.డా. ధరంసోతు సీతారాం నాయక్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తూ టీఐసీసీఐ నుంచి అధికారికంగా నియామకం జరిగినట్లు తెలిపారు. మహబూబాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు జిల్లాల్లో గిరిజన పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, యువత మరియు కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులను ప్రోత్సహించడం, వారికి అవసరమైన అవగాహన, మార్గదర్శకత్వం మరియు వ్యాపార అవకాశాలతో అనుసంధానం చేయడం తన బాధ్యతల్లో భాగంగా ఉంటుందని డా. సీతారాం నాయక్ తెలిపారు.బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు మరియు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ వ్యాపార రుణాలు, ఎంఎస్ఎంఈ అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, వెండర్ డెవలప్‌మెంట్, ప్రభుత్వ కొనుగోళ్లు మరియు మార్కెట్ అవకాశాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సెప్టెంబర్ 4న పారిశ్రామికవేత్తల అవగాహన కార్యక్రమంఈ కార్యక్రమాల్లో భాగంగా 2026 సెప్టెంబర్ 4న హన్మకొండ నయిమ్ నగర్‌లోని హోటల్ అరోమాలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు పారిశ్రామికవేత్తల అవగాహన మరియు ప్రత్యేక వెండర్ అభివృద్ధి కార్యక్రమం నిర్వహించనున్నారు.నేషనల్ ఎస్సీ ▪ ఎస్టీ హబ్, భారత ప్రభుత్వం ▪ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, టీఐసీసీఐ ▪ తెలంగాణ చాప్టర్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ పథకాలు మరియు ప్రభుత్వ రాయితీలు, వ్యాపార అభివృద్ధి మరియు విస్తరణ, బ్యాంకు రుణాలు మరియు ఆర్థిక అవకాశాలు, జీఈఎం వేదిక ద్వారా ప్రభుత్వ కొనుగోళ్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు వెండర్‌గమారే అవకాశాలు, సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ మరియు మెంటరింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు.ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారు, కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారు, బిజినెస్ లోన్ కోసం ప్రయత్నిస్తున్న వారు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, వ్యాపారులు, సేవా రంగానికి చెందిన వారు మరియు ఎస్సీ/ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మహబూబాబాద్ జిల్లా నుంచి ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకుని కార్యక్రమంలో పాల్గొనాలని టీఐసీసీఐ మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త మరియు ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్‌చార్జి డా. ధరంసోతు సీతారాం నాయక్ కోరారు.ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.నన్ను సంప్రదించే నెంబర్

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేతకు ఘన నివాళి

సూర్యాపేట సెప్టెంబర్ 02:(విజన్ ఆంధ్ర)ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించి, పేదలు, రైతుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ అందించిన సేవలను స్మరించుకున్నారు.ప్రజల కోసం జీవించిన మహానేత వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు అన్నారు.వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బైరు శైలేందర్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కరీం,శనగాని రాంబాబు,గౌస్, సునీత, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెంపుడు కుక్కల ఆరోగ్యం కోసం 'హెల్తీ బెల్లీ' విడుదల



హైదరాబాద్, సెప్టెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : ఇంట్లో తయారుచేసిన ఆహారం తినిపించే పెంపుడు జంతువుల యజమానుల్లో 26 శాతం మంది కుక్కల్లో జీర్ణ సమస్యలను గమనించినట్లు మార్స్ పెట్ న్యూట్రిషన్ ఇండియా అంతర్గత అధ్యయనంలో వెల్లడైందని మార్స్ పెట్ న్యూట్రిషన్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అయేషా హుడా బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెద్ద కుక్కల ఆరోగ్యకరమైన జీర్ణక్రియకు తోడ్పడే పెడిగ్రీ హెల్తీ బెల్లి సంపూర్ణ, సమతుల్య ఆహారాన్ని పెడిగ్రీ విడుదల చేసినట్లు చెప్పారు. 22ఫీట్ ఎగ్జిక్యూటివ్ క్రియేటివ్ డైరెక్టర్ శ్యామ్ నాయర్ తోకలసి అయన మాట్లాడుతూ గుమ్మడికాయ, చిలగడదుంప, సులభంగా జీర్ణమయ్యే చికెన్, గుడ్డు ప్రోటీన్లు, ప్రీబయోటిక్స్, ఫైబర్ ఇందులో ఉన్నాయని తెలిపారు. శాస్త్రీయ పోషకాహారంతో కుక్కల జీర్ణ ఆరోగ్యానికి ప్రత్యేక పరిష్కారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఉత్పత్తి ప్రచారంలో భాగంగా భారత క్రికెటర్ కేఎల్ రాహుల్, అతని కుక్కతో రూపొందించిన బ్రాండ్ ఫిల్మ్‌ను విడుదల చేసినట్లు చెప్పారు.

# రీ సర్వేలో తప్పులకు తావివ్వొద్దు

## భూముల రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



ఎల్లారెడ్డిపేట రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో):భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ వివరాల నమోదులో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లి గ్రామంలో రోవర్ యంత్రాల ద్వారా నిర్వహిస్తున్న భూముల రీ సర్వే ప్రక్రియను బుధవారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించిన ఆయన అధికారులు, సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. గ్రామ పరిధిలోని రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన వివరాలు, రీ సర్వే పురోగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేకు సంబంధించి గ్రామంలోని రైతులకు ముందస్తుగా సమాచారం అందించారా లేదా అనే వివరాలను కూడా ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, భూముల హద్దులు, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకూడదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారం అందిస్తూ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వేణు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్వేతార్క గణపతి 16రోజుల నవరాత్రి కల్యాణోత్సవ పత్రిక ఆవిష్కరణ

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర)స్వయంభూ శ్రీ శ్వేతార్కమూల గణపతి స్వామి దివ్య క్షేత్రంలో 16 రోజుల హాట్ గా జరిగే నవరాత్రి కల్యాణోత్సవాల పుస్తక ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ ఈరోజు భక్తులు గణపతి దీక్ష స్వాములు మరియు కార్యకర్తల ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది.... ఎంతో వైవిధ్య భరితమైనటువంటి కార్యక్రమాలతో జరిగే 16 రోజుల ఉత్సవాలలో శ్రీ స్వామివారికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క రీతిన జరిగే అభిషేక హోమ పూజ విశేష సాహిత్య సాంస్కృతిక ప్రత్యేక పూజ కైంకర్యాల పూర్తి వివరాలు తెలిపే రంగుల పుస్తకమును ఆవిష్కరించడమైనదని దేవాలయ వైదిక నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణశర్మ తెలిపారుప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఈ పుస్తకమును తీసుకొని శ్వేతార్క మూలగణపతి స్వామి వారి సన్నిధిలో జరుపబడే ఉత్సవాల్లో తాము భాగస్వాములు కాగలరు..కావున ప్రతి ఒక్కరి పుస్తకమును దేవాలయంలో లేదా 9347080055 అనే వాట్సాప్ నెంబర్ లో నవరాత్రి పుస్తకమని అడిగిన మీకు పంపించడం జరుగుతుందని పరిపాలన నిర్వాహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ తెలిపారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ సంక్షేమ పాలనపై నిరసన హాస్యాస్పదం

## కెసిఆర్ ఏది మాట్లాడాలన్నా అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి

## సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



సూర్యాపేట సెప్టెంబర్ 02:(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అలాంటి పాలనపై బిఆర్ఎస్ నిరసనలు వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల పౌర సరఫరా శాఖ మంత్రి వర్యులు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అద్భుతంగా మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకొని సంక్షేమ పాలన సాగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని దిగిపోవాలని నిరసనలు చేయడం దేనికన్నారు. 25 లక్షల పైగా రైతు కుటుంబాలకు రెండు లక్షల వరకు రుణ మాఫీ కల్పించినందుకు, ఉచిత విద్యుత్తు రైతు సంక్షేమానికి 1.72 లక్షల కోట్లు ఖర్చు చేసినందుకు ప్రజా ప్రభుత్వం దిగిపోవాలా అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ 12167 కోట్ల బస్సు చార్జీలు ఆదా కల్పించామని, గృహ జ్యోతి పథకం కింద 53 లక్షల పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని, 43 లక్షల కుటుంబాలకు 500 కే గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, మహిళా సంఘాలకు 60, 487 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చి 1900ల కోట్ల వడ్డీ రాయితీ కల్పించామన్నారు. తొలి విడుతలో 4.50 లక్షల ఇందిర ఇండ్లు అందించి ఇంటి నిర్మాణానికి 5 లక్షల చొప్పున గ్రేటర్ సిటీలో ఇందిరమ్మ టవర్స్ లక్షమందికి ఇందిరమ్మ ఇండ్లు కల్పించామని గుర్తు చేశారు. 72,000 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు మరో 7,437 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ కల్పించామని, 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం అందించడంతో పాటు 15.46 లక్షల కొత్త రేషన్ కార్డులు అందించామన్నారు. 2.25 లక్షల మందికి పెన్షన్లు, 22 లక్షల మంది విద్యార్థులకు రూ 720 కోట్లతో అల్పాహారం పోషకాహారం అందిస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5, 18, 180 మంది నిరుపేద రోగులకు 2,527 కోట్లు సాయం అందించామని, రిటైర్డ్ ఉద్యోగులకు వంద రోజుల్లో 6000 కోట్ల బకాయిలు చెల్లించామని, 2025-26లో ఐటి ఎగుమతులు రూ. 3.97 లక్షల కోట్లు, 12.14 లక్షల ప్రత్యేక ఐటీ ఉద్యోగాలు కల్పించడంతో పాటు హైదరాబాదులో 355 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసినందుకు ఈ ప్రజా ప్రభుత్వం దిగిపోవాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అభివృద్ధికి చిరునామాగా నిలిచిందనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. కెసిఆర్ కు ప్రతిపక్ష నాయకుడిగా నెలకు రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రశ్నించే ముందు పదేండ్ల మీ మ్యానిఫెస్టోలో ఏం చేశారో చెప్పాలన్నారు. మూడేళ్లలో కెసిఆర్ మూడుసార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని ఆయన ఏది చెప్పాలనుకున్న అసెంబ్లీకి వచ్చి చెప్పాలన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు కేసిఆర్ ప్రతిపక్ష పాత్రను సక్రమంగా పోషించాలని కాదని ప్రజలను మభ్య పెట్టేందుకు రోడ్లపైకి వచ్చి ధర్నాలు రాస్తారోకోలు చేస్తే ప్రజా ప్రభుత్వం సహించదని ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బైరు శైలేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరీం, జిల్లా నాయకులు శనగాని రాంబాబు, కుందమల్ల శేఖర్, పందిరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల్లో అంతా మోసమే.. హామీల అమలు శూన్యం

## కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్



నారాయణపేట , సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సి ఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాల నలో ప్రజలను మోసమే చేశారని హామీల అమలు శూన్యం అని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపిం చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ ఏమైం దనీ ప్రశ్నించారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి, బీసీలకు న్యాయం చేయడంలో మాత్రం ప్రభు త్వం విఫలమైందని అన్నా రు. 42 శాతం రిజర్వేషన్లు ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టం చేయాలనిడిమాండ్ చేశారు. రైతులు, మహిళ లు, యువతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయనీ మహిళలకు నెలకు 2,500, రైతులకు 15,000 రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు 12,000, నిరు ద్యోగులకుఉద్యోగాలు ˙భృతి హామీలపై ప్రభుత్వం ప్రజ లకు పూర్తి లెక్కలు చెప్పాల ని డిమాండ్ చేశారు. 1000 రోజుల పాల నపై శ్వేత పత్రం విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి రావ చ్చు కానీ ప్రజల సమ స్యల నుంచి తప్పించుకో లేరనీ ప్రజలు బుద్ధి చెప్ప డం ఖాయమని హెచ్చరించారు.

# అవినీతి రహిత సమాజమే పవన్ కళ్యాణ్ లక్ష్యం




సూర్యాపేట సెప్టెంబర్ 02:(విజన్ ఆంధ్ర)అవినీతి, కుంభకోణాలు లేని సమాజ నిర్మాణమే జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని జనసేన పార్టీ జిల్లా నాయకులు ఏవి రావు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జమ్మిగడ్డ జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ప్రతి రూపాయి అర్హులైన ప్రజలకు చేరేలా, అవినీతికి తావులేని సమాజ నిర్మాణం కోసం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ కీలక మార్పుకు నాంది పలుకుతారని అన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింతగా పనిచేయాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పలు కూడలిలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూక్య సైదులు నాయక్, దండు మధు, సాయి స్వరూప్, ఓరుగంటి జగదీశ్వరి, భూక్య రవి, లింగ నాయక్, సురేష్, సతీష్, సాయి, సైదులు, మనీష్, బాలగిరి, గణేష్, చింటూ తదితరులు పాల్గొన్నారు

# మీ ఆత్మీయతఅనురాగం కలకాలం ఉండాలి

## మాజీ ఎమ్మెల్యే చేతికి రాఖీ కట్టిన కౌన్సిలర్ కాకర్ల



నారాయణపేట , సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) మీ ఆత్మీయత అనురాగం కలకాలం ఇలాగే ఉండాలని నారాయణపేట జిల్లా కేంద్రంలోని బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి చేతికి మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ రాఖీ కట్టి మిఠాయిని తినిపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ మాట్లాడుతూ మీ అండదండలతో మూడో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ఎస్ రాజేందర్ రెడ్డి హయాంలో రెండో వార్డులోని ప్రజల సమస్యలను పరిష్కరించామని అన్నారు. మూడవ వార్డును కూడా అలాగే అభివృద్ధి చేసేందుకు మీ సహాయ సహకారాలు ఎప్పటికీ నాపై ఉండాలని కోరారు. వార్డు సమస్యలను పరిష్కరించేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మీ అండ కూడా మాపై ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరారు.

# మహనీయుల విగ్రహాలకు అవమానం సహించం



సూర్యాపేట సెప్టెంబర్ 02:(విజన్ ఆంధ్ర)మహనీయుల విగ్రహాలను అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు బొజ్జ పరశురాములు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రం ఖమ్మం ఎక్స్ రోడ్డు వద్ద బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి ఆదేశానుసారం వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. . ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ మహారాజ్ వంటి మహనీయుల విగ్రహానికి నల్లరంగు పూయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మహనీయుల ఆశయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారి విగ్రహాలను అవమానించడం ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ మహనీయుల పట్ల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉందని, అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులకు, అవమానకర చర్యలకు దారితీయడం మంచిది కాదని పేర్కొన్నారు. ఇటీవల బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను కూడా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాజకీయ కక్షలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రవిదాస్ మహారాజ్ విగ్రహాన్ని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహనీయుల గౌరవాన్ని కాపాడుతూ, వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ దళిత మోర్చా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్మధ రెడ్డి, రుక్మారావు, పాండు రంగాచారి, దోసకాయల పణి నాయుడు, కందుల రమేష్, గుణగంటి పృథ్వి, బాలాజీ నాయక్, దరావత్ రవి, రామచందర్, జానకిరాములు, శివ, ఆఫీసర్ సెక్రెటరీ వర్మ నాయుడు, రోహిత్, కోడి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల సందర్భంగా సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్



భూపాలపల్లి జిల్లా:2 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర)గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన " బి సైబర్ స్మార్ట్ " అవగాహన పోస్టర్లను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ మాట్లాడుతూ, పండుగల సమయంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, క్యూ ఆర్ కోడ్‌లు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు సైబర్ భద్రతకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి నరేష్ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఎస్పై శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివకుమార్, సైబర్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

## ఐనవోలు మండలం పంథిని గ్రామ పరిధిలోని చింతకుంట లో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ను పరిశీలించిన కలెక్టర్



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర)రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే యాప్ లో పకడ్బందీగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామ పరిధిలోని చింతకుంట లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతున్న తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్ల వారీగా వివరాల నమోదు, సాంకేతిక వ్యవస్థ పనితీరు, జియో మ్యాపింగ్, పంటల ఫొటోల నమోదు, తదితర అంశాలను పరిశీలించడంతో పాటు స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా ప్రతి రైతుకు సంబంధించిన సర్వే నంబర్‌లో సాగు చేస్తున్న పంట రకం, సాగు విస్తీర్ణం తదితర వివరాలను డిజిటల్ యాప్ లో నమోదు చేయాలన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదయ్యే సమాచారం భవిష్యత్తులో వివిధ వ్యవసాయ సేవలకు కీలక ఆధారంగా మారే అవకాశం ఉన్నందున, ఎలాంటి తప్పులు లేకుండా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఏడీఏ రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి సునీల్‌తో పాటు ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలన.. హామీల అమలు ఏదీ?

## -చల్లా ధర్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే.

## కాంగ్రెస్ వైఫల్యాలపై పరకాలలో బీఆర్ఎస్ నిరసన

## చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో 420 అడుగుల ఫ్లెక్సీతో భారీ ర్యాలీ.. బస్టాండ్ వద్ద ధర్నా



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాలలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు 420 అడుగుల ఫ్లెక్సీ తో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. మొదటగా అంబేద్కర్ సెంటర్ లోని వారి విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించి బస్టాండ్ కూడలి వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రెండు లక్షల ఉద్యోగాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని దేవుళ్లపైనా ఒట్లువేసి,బాండ్ పేపర్లపై సంతకాలు చేసి హామీ ఇచ్చినప్పటికీ.. 1000 రోజులు గడిచినా ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఆరోపించారు. రైతులు,మహిళలు,యువత,నిరుద్యోగులు,పేదలకు ఇచ్చిన హామీల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గుర్తుచేశారు. ఇక కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని,కర్రుకాల్చి వాతలు పెట్టడానికి ప్రజలున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదన్నపేట్ మార్కెట్ లో భారీ అగ్నిప్రమాదం

## మార్కెట్ లో వరుస ఘటనలు

హైదరాబాద్మాదన్నపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదన్నపేట్ మార్కెట్లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మంటలు అర్పడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది. గతంలో కూడా రెండుసార్లు అగ్నిప్రమాదం చోటుచేసుకున్న మార్కెట్ యాజమాన్యం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో స్థానికులు, వ్యాపారస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యజమ్యం కేవలం లక్షల్లో కిరాయిలు వసూళు చేసుకుంటున్నారని ...కానీ జాగ్రత్తలు పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ ప్రాణ నష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు

## పేదల మనసులు చెదరని ముద్ర వై ఎస్ రాజశేఖర్ రెడ్డి

### వై ఎస్ ఆర్ వర్ధంతి కార్యక్రమం లో పాల్గొన్న మాజీ ఎంపీ సోయం బాపూరావు



ఆదిలాబాద్ జిల్లా ( విజన్ ఆంధ్ర బ్యూరో )ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేకర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్లే రాజ్ గొండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరై వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పేదల లకు పెద్దన్నాల ఆదుకున్న మహనీయుడు వై ఎస్ అని వారు చేసిన సేవలను కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్లు,విద్యార్థులకుఫీస్ రియాంబర్స్ మెంట్, 108 అంబులెన్సు, 2 లక్షల రుణమాఫీ లాంటి ఎన్నో కార్యక్రమలు తీసుకొచ్చి పేదల మనసులో చెదరని ముద్ర వేసుకున్నరన్నారు. కార్యక్రమంలోఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి ఆడే గజేంద్ర, డిసిసిబి మాజీ చైర్మన్ ఆడి భోజారెడ్డి,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన 420 హామీలకు దిక్కేది

**రాబోయే 800 రోజులు కాంగ్రెస్ నాయకులకు నిద్రలేనిరోజులే.**

**- 420 హామీల అమలుపై బీఆర్ఎస్ పోరుబాట**

**- నారాయణపేటలో 420 అడుగుల ఫ్లెక్సీతో భారీ నిరసన**

**హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తాం.**

**- పేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, ఇంచార్జి రాజీవ్ సాగర్**



నారాయణపేట, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినప్పటికీ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో అనేకం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే 800 రోజులు నిద్రలేని రోజులేనని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను గుర్తుచేస్తూ 420 హామీలతో రూపొందించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శించి, అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున డప్పు, వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హామీల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు దిక్కేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల సాయం, మహిళలకు హామీ ఇచ్చిన తులం బంగారం, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు బీమా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పెంచకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తాగునీరు, విద్యుత్, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఇటీవల చోటుచేసుకున్న వరుస మరణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి ప్రజా సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని గుర్తుచేస్తూ, ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుందని, హామీలన్నీ అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని ఎస్. రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే 800 రోజులు కాంగ్రెస్ నాయకులకు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన నిద్రలేని రోజులేనని హెచ్చరించారు. తన హాయంలో నారాయణపేట లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు నేడు చెడిపోయిన కొన్ని బల్బులను మార్చలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడడం చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ ఆయా మండలాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శత్రువులు కూడా అభినందించే గొప్ప నాయకుడు "వైఎస్సార్"

**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**

**షాద్ నగర్ లో వైయస్సార్ వర్ధంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ**

**తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన దైవం వైయస్సార్**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**

**షాద్ నగర్ లో ఘనంగా వైఎస్ వర్ధంతి**

**వైయస్ సేవలను సభలో పెద్ద ఎత్తున కొనియాడిన కాంగ్రెస్ నేతలు**

**విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తదితర నేతలు**



షాద్ నగర్ సెప్టెంబర్ 02(విజన్ ఆంధ్ర ):శత్రువులు కూడా అభినందించే గొప్ప నాయకుడు "వైఎస్సార్" అని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్"వీర్లపల్లి శంకర్" కొనియాడారు. అదేవిధంగా తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన మహా నాయకుడు వైయస్ రాజశేఖర రెడ్డి అని మరో నేత స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నూతన వైయస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వర్ధంతి సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి గ్రామాల నుండి పెద్ద ఎత్తున వైయస్ అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ధంతి సభలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. రాజశేఖర రెడ్డి అంటే సంక్షేమం.. సంక్షేమం అంటే రాజశేఖర రెడ్డి అని కొనియాడాడు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2009వ సంవత్సరం, సెప్టెంబర్ 2వ తేదీన రచ్చబండ కార్యక్రమానికి హాజరవుతూ నల్లమల అటవీ ప్రాంతంలోని పావురాలగుట్టలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారని, 2004 నుంచి 2009 వరకు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయారన్నారు. ఆయన మరణించి 17 సంవత్సరాలు అవుతున్నా ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ..'తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన మహా నాయకుడు వైయస్ఆర్ అని ఆయన యుగానికి ఒక్కడు అని అన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన గొప్ప వ్యక్తి వైయస్ఆర్ అని ఆయన అమలు చేసిన పథకాలను దేశంలో ఎన్నో రాష్ట్రాలు అమలు చేశాయన్నారు. రాజశేఖర్ రెడ్డి భౌతికంగా ప్రజలకు దూరమైనా ప్రజల గుండెల్లో ఆయన కొలువై ఉన్నారనీ అంబులెన్స్ కుయ్ కుయ్ అనే శబ్దంలో ఉన్నారని గుర్తు చేశారు. ' పేదల కోసం ఆరోగ్యశ్రీ ,ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి వైయస్ఆర్ అని, సంక్షేమానికి సంతకం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన ప్రజలకు దూరమై 17 సంవత్సరాలు గడిచినా ప్రజల గుండెల్లో మాత్రం ఆయన కొలువై ఉన్నారు' అని కొనియాడారు. స్థానిక నేత ఇబ్రహీం వైయస్సార్ విగ్రహ ఏర్పాటుకు రాత్రింబవళ్లు కృషి చేసి ఏర్పాటు చేసినందుకు ప్రతాపరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న బాలికల పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ 17 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యామ్ సుందర్ రెడ్డి, షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘు నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కొత్తూరు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, సింగిల్ విండో చైర్మెన్ లు చల్ల శ్రీకాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయ్ కల్ శ్రీనివాస్, కుమార స్వామి గౌడ్, పురుషోత్తం రెడ్డి, అన్మగల్ల రమేష్, ఎల్లారం శేఖర్ రెడ్డి,జాకరం చంద్ర శేఖర్,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్,మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,కౌన్సిలర్లు రాజు నాయక్, కొప్పునూర్ ప్రవీణ్,కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, ఇబ్రహీం, జమ్రుత్ ఖాన్, కొంకల్ల చెన్నయ్య,ధంగు శ్రీనివాస్ యాదవ్, కేకే కృష్ణ, కట్ట వెంకటేష్ గౌడ్,శ్రీను నాయక్, అంబటి ప్రభాకర్, ఖాదర్ ఘోరీ,చంద్ర పాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ,జాంగారి రవి, సోలిపూర్ శ్రీశైలం గౌడ్, అన్నారం రాములు గౌడ్,తుపాకుల శేఖర్ ముదిరాజ్, కరుణాకర్, లింగారెడ్డి గూడ అశోక్, ముబరక్, దాకం మనీష్, రవితేజ చిన్న, జాంగారి జంగయ్య, హైదర్ ఘోరీ, లయక్ బాయి,సత్య నారాయణ రెడ్డి, విఘ్నేష్ రెడ్డి,నక్క బాలరాజు యాదవ్, బాలు నాయక్, పుల్లారెడ్డి, లింగరం యాదయ్య,మల్లేష్ గౌడ్, తంగేడ్ పల్లి శంకర్, శర్ఫొద్దిన్, నిరటి వాసు, గంగనమోని సత్తయ్య, మహిళ కాంగ్రెస్ నేతలు రమాదేవి, నాగమని,సర్పంచులు వెల్జర్ల ఆర్ బాబు నాయక్, గంట్ల వెల్లి మాజీ సర్పంచ్ యాదయ్య, సర్పంచ్ సంఘాల నేతలు కొమ్ము కృష్ణ, శివారెడ్డి, చందు నాయక్, శ్రీను నాయక్, మంకల శ్రీశైలం, శివ రాములు, భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ,వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు..

## ప్రొ.ఎం.కుమార్ ములుగంకు రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డు



హైదరాబాద్, సెప్టెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : 30 ఏళ్లకు పైగా ఉన్నత విద్యా రంగంలో సేవలందించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి, సీనియర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ ములుగంను డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డు–2026కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం(తెలంగాణ ఇంటెలెక్చువల్స్ ఫోరం) రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ్ ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ నుంచి ఈ ఏడాది ఈ అవార్డుకు కుమార్ ములుగంను ఒక్కరినే ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 4న ఓయూ వీసీ లాడ్జ్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రొ.కుమార్ 100కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించడంతో పాటు 90కి పైగా ఓఈఆర్ రిజిస్ట్రేషన్లతో, పీహెచ్‌డీ పరిశోధకులకు మార్గదర్శకత్వంతో గుర్తింపు పొందారని తెలిపారు. 2018 ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్ర పురస్కారం, తెలంగాణ ప్రభుత్వ ఇంజినీరింగ్ అవార్డు, 2019 విశ్వేశ్వరయ్య బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు తదితర గౌరవాలు అందుకున్నట్లు చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ, జె.ఎన్.టీ.యు నుంచి డిగ్రీలు, ఐఐటీ బాంబే నుంచి పీహెచ్‌డీ పొందారని, 2018–2021లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్‌గా సేవలందించాని తెలిపారు. ఈ అవార్డు తెలంగాణ విద్యారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## భూముల రీ సర్వే ను మరింత వేగవంతంగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథినిలో కొనసాగుతున్న భూముల రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**భూముల రీసర్వే పైన ఆనరం వ్యక్తం చేసిన రైతులు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 ( విజన్ ఆంధ్ర) భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూముల రీ సర్వేను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ పరిధిలో 3541 ఎకరాల భూమి ఉండగా ఇప్పటివరకు 2144 ఎకరాల భూమి రీసర్వే పూర్తి అయినట్లు సర్వేయర్లు కలెక్టర్ కు వివరించారు. పట్టాదారు పాస్ బుక్ లో నమోదైన భూమి విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో రైతు అనుభవిస్తున్న భూమి విస్తీర్ణానికి ఏమైనా తేడాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రైతులు రాజిరెడ్డి, రామరాజు, సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి, మాధవి, సరోజన, నిర్మల,తదితర రైతులు భూముల రీ సర్వే జరుగుతున్న పంట పొలాల వద్ద ఉండగా కలెక్టర్ వారితో మాట్లాడారు. రీ సర్వే జరుగుతున్న తీరును గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వే చేస్తుండడం బాగుందని, రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని చేపట్టిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే ను మరో 15 రోజుల్లో పూర్తిచేయాలని సర్వేయర్లను ఆదేశించారు. రైతుల భూములను రీ సర్వే చేసిన వివరాలను ల్యాండ్ పార్సల్ మ్యాప్( ఎల్పీఎం)లో నమోదు ప్రక్రియ కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. రీ సర్వే తో భూముల హద్దులు, విస్తీర్ణం, పట్టాదారు వివరాల్లో స్పష్టత రావడంతో భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. రోవర్లతో సర్వేయర్లు భూ రీసర్వే చేస్తుండగా కలెక్టర్ పరిశీలించి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే క్షేత్రస్థాయిలో పురోగతి బాగుండటంతో జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీరాం భూపాల్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా భూములు కొలతలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, తహసిల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్, తదితరులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలన.. అన్ని అబద్ధాలే..!

**అబద్ధాల కోరు కాంగ్రెస్ సర్కారు**

**ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి రేవంత్..?**

**కెసిఆర్ పాలనలో ప్రశాంతంగా ప్రజా జీవనం**

**కాంగ్రెస్ రాకతో దుర్భర స్థితిలో జనం**

**ఆరు గ్యారెంటీలు అమలు చేసేదాకా పోరాటం తప్పదు.**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ధ్వజం**

**కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై షాద్ నగర్ పట్టణ కూడలిలో ఆందోళన**

**కాంగ్రెస్ 420 హామీలతో రూపొందించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన**

**అంజయ్య యాదవ్ పిలుపుతో గులాబీమయమైన షాద్ నగర్ చౌరస్తాలి**

**కాంగ్రెస్ సర్కార్ పై భారీ నిరసన ప్రదర్శన**




షాద్ నగర్ సెప్టెంబర్ 02(విజన్ ఆంధ్ర):ఎన్నికలకు ముందు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు.. ఎన్నికలు అయ్యాక కూడా అబద్ధాల మీదనే పాలన నడిపిస్తున్నారు.. ఇదెక్కడి న్యాయం సీఎం గారు.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారు..? మీరు అమలు చేయకపోతే పోరాటాల ద్వారా మేమే మెడలు వంచి అమలు చేయిస్తాం.. అంటూ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన పేరును నిరసిస్తూ పట్టణ కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వెయ్యి రోజులు పాలన చేసి కూడా ప్రజాకాంక్షలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, అందుకే ఈ పోరాటానికి అధిష్టానం ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. గతంలో కెసిఆర్ పాలనలో కెసిఆర్ కిట్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామాలు, పట్టణాలను ఎంతగానో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కానీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ఆదాయ వ్యయాలను చూసుకోకుండా ఇష్టారాజ్యంగా మేనిఫెస్టో తయారుచేసి ప్రజలను తప్పుదారి పట్టించి అధికారంలోకి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు గడిచి వెయ్యి రోజులు అవుతున్న ఇప్పటిదాకా 6 గ్యారంటీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తమ తప్పులు ఒప్పుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని, కాలేశ్వరం లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు, రైతులకు ఉచిత కరెంటు వంటి ఎన్నో కార్యక్రమాలు చేసిన కేసీఆర్ ను తప్పు పట్టడం కాంగ్రెస్ చేతకానితనమని పేర్కొన్నారు. ఉచిత బస్సు ఇచ్చి చేయి దులుపుకున్న రేవంత్ రెడ్డి మహిళలకు 2500 పెన్షన్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వికలాంగులకు 6000 పెన్షన్ ఇస్తామన్నారని ఇప్పటిదాకా దానిని అమలు చేయలేదని పేర్కొన్నారు. టబీఆర్ఎస్ హయాంలో వైకుంఠ దామాలు, ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు వంటివి నిర్మించి పట్టణ గ్రామీణ ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేశామని, కాంగ్రెస్కు కెసిఆర్ ను తిట్టడం తప్ప మరో పని లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చదాక తమ పార్టీ పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కెసిఆర్ 200 రూపాయల పెన్షన్ 2000 చేశారని, దీనిని 4000 చేస్తానన్న రేవంత్ రెడ్డి ఎందుకు మాట తప్పారని ప్రశ్నించారు. రైతుబంధుకు 15000 ఇస్తామని చెప్పి గతంలో తమ ప్రభుత్వం ఇచ్చినంత కూడా ఇవ్వకుండా వేధిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగివచ్చేదాకా పోరాటం తప్పదని, సర్కారు మెడలు వంచి మరి గ్యారెంటీలు అమలు చేసేలా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపుమేరకు నియోజకవర్గం నలుమూలల నుండి గులాబీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చాయి. కాంగ్రెస్ 420 హామీలను పురస్కరించుకొని 420 అడుగుల ఫ్లెక్సీని రూపొందించారు. ఈ కార్యక్రమంలో నేతలు వి. నారాయణరెడ్డి, ఎమ్మె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, నరేందర్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్, మాజీ స్త్రీ, శిశు సంక్షేమ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి తదితరులు, అలాగే మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ గ్రంథాలయ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వైస్ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల, గ్రామ, మున్సిపాలిటీ, వార్డు అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

## సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2,( విజన్ ఆంధ్రఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షల వైపు సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం ఇందిరనగర్ లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకుల హాజరు పట్టికలు, తరగతి గదులు, విద్యాబోధన తీరు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులు 100 శాతం కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహన కలిగే విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అనంతరం రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వల గది, రోగులు చికిత్స పొందుతున్న గదులను పరిశీలించి రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, చిన్నచిన్న కారణాలతో రోగులను ఇతర ప్రాంతాలకు సిఫారసు చేయకూడదని తెలిపారు. నెలలు నిండిన గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండి సుఖప్రసవానికి చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

## ముగిసిన హైసియా ఇంటర్ కార్పొరేట్ స్పోర్ట్స్ టోర్నమెంట్



హైదరాబాద్, సెప్టెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : 25వ హైసియా ఇంటర్ కార్పొరేట్ స్పోర్ట్స్ టోర్నమెంట్ 2025–26 ముగిసినట్లు హైసియా అధ్యక్షుడు ఫ్లైట్ లెఫ్టినెంట్ విపిన్ పెండ్యాల బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇన్ఫోసిస్, టీసీఎస్ చెరో 5 టైటిళ్లు, 11 పోడియం ఫినిష్‌లతో ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయని తెలిపారు. డెలాయిట్ కన్సల్టింగ్ ఇండియా పురుషుల ఫీల్డ్ క్రికెట్, మహిళల బాక్స్ క్రికెట్ టైటిళ్లు గెలుచుకుంది. ఎన్విడి ఇండియా(బాస్కెట్‌బాల్), ఎంటైన్ సాఫ్ట్‌వేర్(మెన్స్ ఫుట్‌బాల్), డి.ఇ.షా(టెన్నిస్), సింక్రనీ ఇంటర్నేషనల్(పూల్) విజేతలుగా నిలిచాయని తెలిపారు. ఫిబ్రవరి-జూన్ మధ్య 60కిపైగా ఐటీ, జీసీసీ సంస్థలకు చెందిన 270కిపైగా జట్లు, 2,135 మంది టెకీలు 17 క్రీడాంశాల్లో పోటీపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ గచ్చిబౌలి డీసీ హెడ్ ప్రణబ్ భరద్వాజ్, పీడబ్ల్యూసీ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ మహమ్మద్ ఆసిఫ్ ఇక్బాల్, బ్రిగేడియర్ ఇందర్ సేతి, 2024 క్యారమ్స్ వరల్డ్ చాంపియన్ కె.శ్రీనివాస్ పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందజేశారని తెలిపారు.

## ఆరు గ్యారంటీలతో గెలిచి.. 420 హామీలకు ఎగనామం!

### కాంగ్రెస్‌పై మాజీ మంత్రి మల్లన్న ఫైర్.. 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ధ్వజం డీజే దరువుకు మల్లన్న మాస్ స్టెప్పులు

బోడుప్పల్, సెప్టెంబరు 2 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమం వినూత్నంగా సాగింది. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏర్పాటు చేసిన డీజేలో 'సారే రావాలంటున్నరే తెలంగాణ పల్లెల్లో.. కారే కావాలంటున్నరే' పాట మార్మోగింది. దీంతో మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఉత్సాహంగా స్టెప్పులేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కార్యకర్తలు కేరింతలు, ఈలలతో సందడి చేశారు. కొద్దిసేపు నిరసన కార్యక్రమం కాస్తా డీజే దరువుతో హుషారెత్తింది. మల్లారెడ్డి డ్యాన్స్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ అంటేనే దగా.. మోసం అంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు హామీల అమలును గాలికొదిలేసిందని ఆరోపించారు. వికలాంగుల పింఛన్లు ఎక్కడ? మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 ఎక్కడ? ఆడబిడ్డల పెళ్లికి ఇస్తామన్న తులం బంగారం ఎక్కడ? రైతు బీమా, నిరుద్యోగ భృతి ఏమయ్యాయి? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో నగర మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, బందారపు శ్రీధర్‌గౌడ్, కొత్త రవిగౌడ్, కాటం రాజిరెడ్డి, మీసాల గిరి, తాల్క శత్రఙ్ఞ, ఎల్లగొని శ్రీహరి, బొడగల్ల సదానంద్, ఆలీం, గడ్డ తిరుపతి యాదవ్, దేవరాజు, నర్సింగ్ నాయక్, కృష్ణగౌడ్, ఉప్పలయ్య, యువజన నాయకులు సామల మనోహర్‌రెడ్డి, ఉప్పరి విజయ్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన అభిమానులు



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 02(విజన్ ఆంధ్ర) జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా స్థానిక వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చిన్నపిల్లలకు స్లేట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అడ్ హాక్ కమిటీ యువజన విభాగం సభ్యులు మరియు జనసేన పార్టీ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నాయకులు మరియల వినీత్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు..

ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా నాయకులు మరియల వినీత్ మాట్లాడుతూ... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని నిరంతరం ప్రజలకు ఏ కష్టం వచ్చిన అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆసిఫాబాద్ జనసేన నాయకులు కాచం క్రాంతి , పురుషోత్తం పవన్ కళ్యాణ్,చౌ్బ్లెకర్ రాజు , దివి చారీ,ఉత్తేజ్ చారీ,రాపర్తి సతీష్ , శివ హర్ష , వైరాగడే రమేష్ , వైరాగడే రవి, సాయి , చందు జనసైనికులు, అభిమానులు పాల్గొని కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మ్యాపింగ్ కానీ, అనామాలీస్ జాబితాలోని ఓటర్లకు నోటీసులపై విచారణకు ప్రత్యేక కేంద్రాలు

### అక్టోబర్ 18 వరకు కొనసాగనున్న విచారణ ప్రక్రియ
### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
### హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక విచారణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 ( విజన్ ఆంధ్ర )ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కానీ, అనామాలీస్ జాబితాలో ఉన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లకు సంబంధించిన అభ్యంతరాలు, నోటీసులపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లోని పోలింగ్ కేంద్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఏఈఆర్ఓ విచారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ సందర్శించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 50 విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల లోనే ఐదు, ఆరు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన విచారణలను నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లను విచారణకు హాజరుకావాలని సూచించారు. నోటీసులు అందుకున్నవారు ఎన్నికల సంఘం సూచించిన విధంగా సంబంధిత ధ్రువపత్రాలతో విచారణ కేంద్రాలకు హాజరై ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. విచారణకు హాజరైన నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ప్రతి ఓటరు సమర్పించిన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు, హాజరు రిజిస్టర్‌లో సంతకం తీసుకోవాలని అధికారులను సూచించారు. రోజువారీగా వచ్చిన దరఖాస్తులు, విచారణలను అదే రోజు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విచారణ ప్రక్రియలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు సమన్వయంతో పనిచేస్తూ షెడ్యూల్ ప్రకారం నోటీసులు సర్వే చేయడం, ఓటర్ల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించడం, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వంటి ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా తుది ఓటర్ల ముసాయిదా జాబితాలో చోటు కోల్పోకుండా అవసరమైన పత్రాలను సమర్పించేలా ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడం, అర్హులైన వారు తమ ధ్రువపత్రాలతో విచారణకు హాజరయ్యేలా సహకరించడం ద్వారా తుది ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా రూపొందించేందుకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఈఆర్ఓ/ హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, హనుమకొండ ఏఈఆర్ఓ/ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలి –జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో , సెప్టెంబర్: 2(విజన్ ఆంధ్ర )భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్నందున, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి, ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో భాగంగా 2026 ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్దేశిత గడువులోగా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వద్ద క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు గడువు సెప్టెంబర్ 16 వరకు ఉందని తెలిపారు. అర్హత కలిగిన పౌరులు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు, వివరాల సవరణ తదితర అంశాలకు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సంబంధిత ఈ ఆర్ ఓ వద్ద నిర్దేశిత విధానంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాల జాబితాలను ప్రజల సమాచారార్థం అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత లు ఈ జాబితాలను వారానికి ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేస్తారని పేర్కొన్నారు. జాబితాలో చేర్చిన ఏదైనా క్లెయిమ్‌పై అభ్యంతరం ఉన్న పౌరులు నిర్దేశిత విధానాన్ని అనుసరించి సంబంధిత ను సంప్రదించవచ్చని తెలిపారు. క్లెయిమ్ లేదా అభ్యంతరంపై సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తీసుకున్న నిర్ణయంపై సంతృప్తి చెందని వారు మొదటి అప్పీల్ అధికారిగా జిల్లా మేజిస్ట్రేట్ కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా, మొదటి అప్పీల్ అధికారి ఇచ్చిన నిర్ణయంపై సంతృప్తి చెందని వారు రెండవ అప్పీల్ అధికారిగా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం ప్రతి అర్హత కలిగిన పౌరుడికి చేరేలా ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన చోట క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలను నిర్దేశిత గడువులోగా దాఖలు చేసుకుని ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

## 1000 రోజులు.. 420 హామీలు..అమలు ఎక్కడ..!

### హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
### మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
### ఫీర్జాదిగూడలో 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ
### ఏడు రోజులపాటు ఆందోళనలు



బోడుప్పల్,సెప్టెంబర్02(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడలో నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమలుకు నోచుకోని హామీలు, బాకీగా ఉన్న పథకాలను వివరిస్తూ 'బాకీ కార్డులు', కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ మేరకు మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. తాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాల విషయంలోనూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ హామీలు, పథకాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. ఏడు రోజులపాటు వరుస ఆందోళనలురాబోయే ఏడు రోజులపాటు రోజుకొక నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను ప్రజల ముందుంచి, వాటి అమలు పరిస్థితిని వివరించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్‌రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్‌రెడ్డి, యువజన అధ్యక్షులు ప్రభు, జావీద్‌ఖాన్, శ్యామల శ్రీనివాస్, ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణతో పాటు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ రాజర్షిషాలి



ఆదిలాబాద్ జిల్లా ( విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లాలో పారదర్శకమైన, తప్పులులేని ఓటర్ల జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సార్)పై ఆయన సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం నో–మ్యాపింగ్, వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో నోటీసులు జారీ చేసి ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విచారణకు ఓటరే స్వయంగా హాజరు కావాల్సిన తప్పనిసరి నిబంధన లేదని, వారు రాలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు లేదా బంధువులు సైతం హాజరు కావచ్చని స్పష్టం చేశారు. విచారణకు వచ్చేవారు కుల, జనన ధ్రువీకరణ, పాస్‌పోర్టు, శాశ్వత నివాస పత్రం, మెట్రిక్యులేషన్, అటవీ హక్కుల పత్రం లేదా ప్రభుత్వ ఇళ్ల పట్టాలు లాంటి గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదాని ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. నిర్దేశిత తేదీల్లో విచారణకు హాజరు కాలేకపోయిన వారికి తదుపరి ఏడు రోజుల వ్యవధిలో విచారణకు హాజరయ్యే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు. అలాగే, 2026 అక్టోబరు 1 నాటికి అర్హత సాధించేవారు, జాబితాలో పేర్లు లేనివారు లేదా తప్పుల సవరణ కోరే వారి కోసం సెప్టెంబరు 5, 6, 12, 13 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. కొత్తగా పేరు నమోదుకు ఫారం–6, మార్పులు–చేర్పులు లేదా అభ్యంతరాలకు ఫారం–8తో పాటు డిక్లరేషన్ ఫారమ్‌లను పూర్తి చేసి ఆయా పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శిశుగృహంలోని ఇద్దరు కవలల దత్తత ప్రక్రియ పూర్తి: కలెక్టర్ రాజర్షిషాలి



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న దంపతులకు పారదర్శక విధానంలో చిన్నారులను దత్తత ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం స్థానిక విద్యానగర్‌లోని జిల్లా శిశుగృహం సంరక్షణలో ఉన్న 4 ఏళ్ల కవల పిల్లలను కలెక్టర్ తన చేతుల మీదుగా తమిళనాడు రాష్ట్రం, కోయంబత్తూరుకు చెందిన ఎస్. సెంథిల్ కుమార్–విజయలక్ష్మి దంపతులకు చట్టబద్ధంగా అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (కారా) పోర్టల్ ద్వారా ఎస్. సెంథిల్ కుమార్, శబరీష విజయలక్ష్మి దంపతులు దత్తత కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. దరఖాస్తు పరిశీలన, ప్రభుత్వ విధివిధానాల ప్రకారం అన్ని అర్హతలు, నిబంధనలు సంతృప్తికరంగా పూర్తి కావడంతో చిన్నారులను స్వయంగా ఆ దంపతుల చేతులకు అందజేసినట్లు వివరించారు. దత్తత తీసుకున్న పిల్లలను ప్రేమతో, బాధ్యతాయుతంగా పెంచి ఉత్తమ భవిష్యత్తును అందించాలని దంపతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్, శిశుగృహ మేనేజర్ విజయలక్ష్మి, లీగల్ అధికారి రమేష్, సోషల్ వర్కర్, ఆయాలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా బండి శ్రీరాములు

### ఘనంగా సన్మానించిన యూనియన్ నాయకులు



బోడుప్పల్,సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉప్పల్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి శ్రీరాములు నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి శ్రీరాములు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, సేవా భద్రత అంశాలపై యూనియన్ చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఉద్యోగులు సంస్థకు వెన్నెముకలాంటివారని, వారి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ బలోపేతం కావడం ద్వారా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వ దృష్టికి మరింత సమర్థవంతంగా చేరుతాయని పేర్కొన్నారు. ఉప్పల్ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితుల మెరుగుదల, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నాయకత్వంతో కలిసి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ సామాజిక, రాజకీయ రంగాల్లో విశేష అనుభవం కలిగిన బండి శ్రీరాములు గౌరవ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఉప్పల్ డిపో ఎంప్లాయిస్ యూనియన్‌కు మరింత బలం చేకూర్చే అంశమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో, పరిష్కార మార్గాలను అన్వేషించడంలో ఆయన అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల ఐక్యత, సంఘటిత శక్తి ద్వారానే హక్కులు సాధ్యమవుతాయని, ఈ దిశగా యూనియన్ మరింత చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ రాఘవులు, జీహెచ్‌జెడ్ అసిస్టెంట్ సెక్రటరీ, సికింద్రాబాద్ రీజినల్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్ భాను, హైదరాబాద్ రీజినల్ సెక్రటరీ పాపయ్య గౌడ్, ఉప్పల్ డిపో అధ్యక్షుడు కాంతారావు, ఉపాధ్యక్షుడు సత్తయ్య గౌడ్, డిపో సెక్రటరీ ఎం.ఎస్. నారాయణ, జాయింట్ సెక్రటరీ సైదులుతో పాటు పలువురు యూనియన్ నాయకులు,కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొని బండి శ్రీరాములకు అభినందనలు తెలిపారు.

## క్షయ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షిషాలి




ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ (టీబీ) రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'ప్రతి ఒక్కరిపై దృష్టి.. టీబీ రహిత తెలంగాణకై కృషి' నినాదంతో కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాధి ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మానసిక, పోషకాహార భరోసా కల్పించడంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు ముందుకు రావాలని కోరారు. లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దనీ, కేవలం దగ్గు మాత్రమే కాకుండా తెమడలో రక్తం పడటం, తరచూ జ్వరం, ఛాతీ నొప్పి, నీరసం, బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం, శరీరంలో వాపులు/గుల్లలు రావడం టీబీ లక్షణాలేనని స్పష్టం చేశారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ఆశా కార్యకర్తలను సంప్రదించి ఉచిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వివరాలు, సలహాల కోసం 'ని–క్షయ్' టోల్‌ఫ్రీ నంబరు 1800–11–6666 ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో డా.సాధన, జిల్లా క్షయ నియంత్రణ అధికారి సుమలత, డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్, జడ్పీ సీఈవో రవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఇతర అధికారులు, సిబ్బంది, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కోనేరు కోనప్ప గళం నిరసన

## ఈ నెల 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశాలు

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2,(విజన్ ఆంధ్ర)రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు బార్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, బీమా సంస్థల స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధులతో, మధ్యాహ్నం 12 గంటలకు పోలీసు, ఆబ్కారీ, అటవీ శాఖల అధికారులతో జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవనంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద కేసులు, ఎన్.ఐ. యాక్ట్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

## తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ భారీ నిరసన.. బాకీ కార్డుల పంపిణీ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ.. వృద్ధాప్య పింఛన్‌ను రూ. 4,000కు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2,500, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పిన హామీలు కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, గురుకుల విద్యార్థుల మరణాలు చోటుచేసుకున్నాయని, చేనేత, ఆటో కార్మికులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. 3.75 లక్షల మంది పింఛన్లలో




కోత విధించారని, కళ్యాణలక్ష్మి, రైతుబీమా వంటి పథకాలు నిలిచిపోయాయని, రైతుబంధు సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. దళితబంధు పథకాన్ని కూడా ప్రారంభించలేదన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల నుంచి రిటైర్డ్ ఉద్యోగుల వరకు అనేక వర్గాలు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యూనివర్సిటీ భూముల నుంచి ప్రాజెక్టుల ఇసుక వరకు అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఒక్క చెక్‌డ్యామ్ కూడా నిర్మించలేదని, ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని, నీటి వనరుల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని కోనప్ప విమర్శించారు. భూగర్భ జలాలు పడిపోతుండగా రాష్ట్రంలో నేరాల రేటు పెరుగుతోందని ఆరోపించారు. 100 రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తయినా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని కోనప్ప అన్నారు. "1000 రోజుల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దశాబ్ద కాలం వెనక్కి నెట్టారు" అని విమర్శించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో ధర్నాలు చేయని వర్గమంటూ లేదని, మోసం చేయని రంగమంటూ లేదని ఆయన ఆరోపించారు. "ఆరు గ్యారంటీలకు, 420 హామీలకు కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు పూర్తయ్యాయి. కానీ వాటి అమలుకు చెప్పిన 100 రోజులు మాత్రం ఇంకా పూర్తికాలేదు" అని ఎద్దేవా చేశారు. అనంతరం తెలంగాణ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాకీ కార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ పంట నమోదు సర్వేను పరిశీలించిన వ్యవసాయ అధికారి



దహేగం, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర): దహేగం మండలంలోని పంబాపూర్, లగ్గాం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ పంట నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం పంట క్షేత్రాల సర్వే నిర్వహించారు. గ్రామాల్లో వాలంటీర్లు చేపడుతున్న పంట నమోదు సర్వే ప్రక్రియను వ్యవసాయ అధికారి జీ. రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న వాలంటీర్‌కు పలు సూచనలు చేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా వాలంటీర్‌కు సహకరించి పంట వివరాలు పక్కాగా నమోదయ్యేలా చూడాలని కోరారు. సన్న రకాల వరి పంట సాగు చేసిన రైతులు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ పొందాలంటే విత్తనాల వివరాలు సక్రమంగా నమోదు కావాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారి తెలిపారు. ఏ షాపు వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేశారో అదే డీలర్ వద్ద ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే రైతు వద్ద ఉన్న విత్తనాలను తిరిగి సాగు చేసిన రైతులు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. డిజిటల్ పంట నమోదు ద్వారా రైతుల పంటల వివరాలు అధికారికంగా నమోదు అవుతాయని, ప్రభుత్వ పథకాలు, పంటకు సంబంధించిన ప్రయోజనాలు పొందేందుకు పంట నమోదు ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. రైతులందరూ సర్వే ప్రక్రియలో అధికారులకు, వాలంటీర్లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పాగిడి ఆదిత్య, వాలంటీర్ పందిర్ల అంజన్న, రైతులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో 'వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు'

### జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి. దత్తారావు...

ుఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2.( విజన్ ఆంధ్ర)వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని సాధించడమే ఎదీ-+ =ూవీ + చట్టం ▪2025 ప్రధాన ఉద్దేశమని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి. దత్తారావు ఒక ప్రకటనలో తెలిపారు.ుఈ రోజు నుండి జిల్లాలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పన ప్రక్రియ అధికారికంగా ప్రారంభమవుతుందని వెల్లడించారు.ుముఖ్యాంశాలు:ు125 రోజుల చట్టబద్ధ ఉపాధి: శ్రమతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి గ్రామీణ కుటుంబానికి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల చట్టబద్ధమైన ఉపాధి హామీ కల్పించడం జరుగుతుందన్నారు ు గ్రామ పంచాయతీల వాస్తవ అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, మౌలిక వసతులు మరియు అభివృద్ధి లోటుపాట్లను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందిస్తాం.ునాలుగు కీలక రంగాలు: నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి మౌలిక వసతులు, విపత్తుల నివారణ అనే నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులను గుర్తిస్తామని అన్నారు ు318 రకాల అభివృద్ధి పనులు - 22 శాఖల సమన్వయం: గ్రామాల అవసరాలకు అనుగుణంగా 318 రకాల అభివృద్ధి పనులను గుర్తించడంతో పాటు, 22 ప్రభుత్వ శాఖల సమన్వయంతో సమగ్ర రూపురేఖలు తయారు చేపడతామని తెలిపారు ుమండల స్థాయిలో ప్రత్యేక బృందాలు: ప్రతి మండలంలో అన్ని గ్రామ పంచాయతీలను కవర్ చేసే



విధంగా 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ బృందాలలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ మరియు పంచాయతీ కార్యదర్శులు భాగస్వాములుగా ఉంటారు.ుఈ మొత్తం ప్రణాళికా రూపకల్పన ప్రక్రియను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయం చేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తారు.ుగ్రామీణ ప్రజల సాధికారతతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో బలమైన, సుసంపన్నమైన గ్రామీణ భారత్‌ను నిర్మించడమే లక్ష్యంగా ప్రణాళికల రూపకల్పన వేగవంతం చేయనున్నట్లు గ్రామీణ ప్రాజెక్ట్ అధికారి బి. దత్తారావు తెలిపారు....

## రక్షాబంధన్ పురస్కరించుకొని కోర్టు సముదాయంలో న్యాయవాదులకు రాఖీ కట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి





ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 .(విజన్ ఆంధ్ర )రక్షాబంధన్ పురస్కరించుకొని ఆసిఫాబాద్ న్యాయవాదులకు ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్ బాబు, మరియు ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ నాయక్, నరహరి,చరణ్ తేజ, ఆకాష్, అంజనీ దేవి జగన్ నాయక్ మరియు విద్యాసాగర్ లకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శారదా దేవి మరియు సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ అనూష న్యావదులకు రాఖీ కడుతూ ఈ కోర్టు ప్రాంగణంలో ఉన్న మనమందరము ఒకరికి ఒకరు సోదరీ సోదర సోదరి సోదర భావనతో ఉండాలని ఉండాలని అప్పుడే ఒక శాంతియుత వాతావరణం ఉంటుందని జడ్జ్ న్యాయవాదులందరికీ రాఖీ కడుతూ నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనమందరము దేశానికి రక్ష అని అంటూ సంతోషాన్ని వ్యక్తపరచడం జరిగింది. ఈ కార్యక్రమం న్యాయవాదులు పాల్గొన్నారు

## టీటీడీ డిప్యూటీ ఈఓ లోకనాథం ఇంట్లో ఏసీబీ దాడులు

తిరుపతిటీటీడీ డిప్యూటీ ఈఓ లోకనాథం నివాసంలో ఏసీబీ దాడులు నిర్వహించింది. తిరుపతిలోని పెద్దకాపు లేఔట్ లోని ఇంట్లో సోదాలు జరిగాయి. కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఏసీబీ దాడుల సమయంలో ఇంట్లోనే టీటీడీ డిప్యూటీ ఈఓ లోకనాథం వున్నారు. తిరుమల లోకనాథం కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు జరిగాయి. తిరుపతి ఏసీబీ డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు ఇండ్లలో సోదాలు కొసాగాయి.

## ఎఫ్.ఆర్.ఎస్. పనితీరు మెరుగుదల, పి.జి.ఐ. సూచికల సాధనకు సమష్టిగా కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2,(విజన్ ఆంధ్ర)కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ఆశించిన ఫలితాలు సాధించేందుకు అధికారులు, ప్రధానోపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు.. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండల కేంద్రంలో గల తెలంగాణ గురుకుల మోడల్ స్కూల్ లో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా రంగానికి సంబంధించిన నాణ్యత, సమానత్వం, ప్రాప్యత, జవాబుదారీతనం, ఆవిష్కరణ తదితర అంశాలలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రతి పాఠశాల కృషి చేయాలని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని విద్యార్థుల అభ్యసన ఫలితాలను పెంపొందించాలని తెలిపారు. యు - డైస్ ప్లస్ లో పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో, ఖచ్చితంగా నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని, డేటా నమోదు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ఆపార్ ఐ.డి. నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, విద్యార్థుల విద్యా వివరాలను డిజిటల్ రూపంలో సమగ్రంగా నిర్వహించేందుకు ఆపార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ఆధార్ వివరాల




నమోదు, ధృవీకరణ, అవసరమైన నవీకరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్.ఆర్.ఎస్.) హాజరు ను క్రమం తప్పకుండా, సక్రమంగా వినియోగించేలా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని, ఎఫ్.ఆర్.ఎస్. పనితీరు మెరుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. విద్యార్థులలో కేవలం విద్యా సామర్థ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక, సామాజిక, శారీరక, సృజనాత్మక, నైతిక విలువలను పెంపొందించేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని, ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహిస్తూ ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు. ఎఫ్.ఎల్.ఎన్., విద్యార్థుల యూనిఫాంలు, సివిల్ వర్క్స్, స్కూల్ విజిట్స్, లీవ్ అకౌంట్ మేనేజ్‌మెంట్, డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్, ఖాన్ అకాడమీ, ఎ.ఐ. ఆధారిత అభ్యసన విధానాలు తదితర అంశాలపై సమీక్షించి, పాఠశాలల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు నూతన, ఆవిష్కరణాత్మక విధానాలను అమలు చేయాలని తెలిపారు.

## ఖానాపూర్‌లో రిసర్వే పనులు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ కుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ఆగస్ట్ 2(విజన్ ఆంధ్ర )జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటించి గ్రామంలో కొనసాగుతున్న రిసర్వే పనులు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా గ్రామంలో కొనసాగుతున్న భూముల రిసర్వే పనులను సంబంధించిన పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థులు రిసర్వే ప్రక్రియకు పూర్తిగా సహకరించాలని కోరారు. రిసర్వే ద్వారా భూముల వివరాలు, హద్దులు స్పష్టంగా నమోదవుతాయని, భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను నివారించేందుకు ఇది దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థులు తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. అనంతరం ఖానాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. గుడ్లు, ఇతర పౌష్టికాహారం విద్యార్థులకు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ విద్యుత్, లైటింగ్, ఫ్యాన్ల సమస్యలను గుర్తించారు. వాటిని వెంటనే మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. దీంతో సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని సర్పంచ్, గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

### ప్రభుత్వ వైద్యుల, సిబ్బంది పనితీరు మెరుగుపడాలి విద్యార్థులకు హెల్త్ కార్డులు అందజేసేందుకు చర్యలు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రభుత్వ ఆసుపత్రిలలోనే ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వైద్యశాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలని, ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయడం తగదన్నారు. ఆలంపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న ఏరియా ఆసుపత్రిలో పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది ఉన్నారని, అక్కడ వైద్య సేవలు పెరిగేలా నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారులు తరచు మెడికల్ అధికారులతో సమావేశాలు నిర్వహించి, మెరుగైన పనితీరు కనబరిచేలా దశానిర్దేశం చేయాలన్నారు. టీ హబ్ కు వివిధ పరీక్షల శాంపిల్స్ పంపించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎన్సీడీ స్క్రీనింగ్ పెరగాలని బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన మందులను అందజేయాలన్నారు. ఎమ్మెల్ హెచ్ పి (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్) సేవలను వినియోగించుకోవాలని, పోషణ్



కిట్స్ ను టీబి వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం ద్వారా విద్యాసంస్థల్లో విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని విద్యాసంస్థల విద్యార్థులకు హెల్త్ కార్డులను అందజేసేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ ను వారంలోగా రూపొందించి అందించాల్సిందిగా ఆయా పిహెచ్సిల మెడికల్ అధికారులను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ప్రోగ్రాం అధికారులు రాజు, రామచంద్రరావు, అస్గర్ అలీ, ప్రసూనరాణి, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పెండింగ్ పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలి

### -కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల పనులు నెలలోగా పూర్తి -విద్యార్థులు, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి -కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-02(విజన్ ఆంధ్ర)రామగుండం ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం రామగుండం ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన ఆయన ప్రభుత్వ పాఠశాలలు, అల్లూరు యూపీహెచ్‌సీ, లక్ష్మీపురం ▪ వీర్లపల్లి రహదారి పనులను పరిశీలించారు. రామగుండం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మార్కండేయ కాలనీ గోదావరిఖని ఉర్దూ మీడియం పాఠశాల, అడ్డగుంటపల్లి, సంజయ్‌నగర్, అల్లూరు, వీర్లపల్లి, చైతన్యపురి, 46వ డివిజన్ శాంతినగర్ ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలలు, నరసింహపురం (న్యూ మారేడుపాక) జడ్పీహెచ్ఎస్‌ను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, భవనాల పరిస్థితి, మరమ్మతులు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల పనుల పురోగతిని పరిశీలించారు. గోదావరిఖని ఉర్దూ మీడియం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ▪ ప్రైమరీ తరగతి గదిని ప్రారంభించారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పునరుద్ధరణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి నెల రోజుల్లోగా విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. అనంతరం అల్లూరు యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఓపీ సేవలు, వైద్యుల అందుబాటు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్ తదితర



అంశాలను పరిశీలించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ శాతం తక్కువగా ఉందని గుర్తించిన ఆయన అర్హులైన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ నిర్వహించి శాతాన్ని పెంచాలని ఆదేశించారు. వైద్యులు నిర్ణీత సమయానికి విధులకు హాజరై రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. లక్ష్మీపురం నుంచి వీర్లపల్లి వరకు జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రహదారుల అభివృద్ధి పనులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించి గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో టీజీఈడబ్ల్యుఐడీసీ ఈఈ అశోక్ కుమార్, డిప్యూటీ ఇంజనీర్ మారుతి, ఏఈ నరేష్, యూపీహెచ్‌సీ డా. దివేన, ఆర్అండ్‌బీ ఏఈ జావిద్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాలువ నీరందక ఎండుతున్న వరి పొలాలు

పెదన పెదన: మండలంలోని జింజేరు గ్రామంలో కాలువ నీరు అందక వరి పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం కాలువ చివరి ఆయకట్టు (టైలెండ్) కావడంతో ఎగువ ప్రాంతాల రైతులు మోటార్లు, ఇంజిన్లతో నీటిని తోడుకోవడంతో దిగువకు చుక్కనీరు కూడా రావడం లేదని వాపోతున్నారు. వరి సాగుకు ఇప్పటికే ఎకరానికి సుమారు రూ. 20 వేల వరకు ఖర్చు చేశామని, పంట ఎండిపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు తెలిపారు. తమ ప్రాంత భూములు ఆరుతడి పంటలకు అనుకూలంగా ఉండవని, వరి సాగుకే అనుకూలమని పేర్కొన్నారు.

# పేదల పక్షపాతి రైతు బాంధవుడు వై.ఎస్.ఆర్



జోగిపేట విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 02 : పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యములో బుధవారం వైస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భముగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు . ఈ సందర్భంగా మార్క్ పెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు డాకూరి వెంకటేశం మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రములో పాదయాత్ర చేసి నిరుపేదల,విద్యార్థుల కష్టాలను చూసి చలించి పోయి రాష్ట్రములో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఉచిత విద్యుత్ పైన సంతకము చేసి రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి వారి కష్టాల్లో ఆదుకున్న రైతు భాండవుడు అయ్యాడు.అలాగే పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందచేసి ఆరోగ్య ప్రదాత అయ్యాడు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇచ్చి విద్యా ప్రదాత అయ్యాడు రాష్ట్రములో ఎన్నో సంక్షేమ పథకాలు అందించి పేదల పక్షపాతిగా నిలిచాడు అన్నారు. అలాగే రాష్ట్రములో తన పాదయాత్రతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి ఘనత ఆయనదే అన్నారు ఆందోల్ నియోజకవర్గానికి సింగూర్ జలాలు ఇచ్చి 40000 వేల ఎకరాలు సస్యశ్యామలం చేశారు అని కొనియాడారు. ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్,కౌన్సిలర్స్ కోశికే రాజశేఖర్,హరికృష్ణ,రామకృష్ణ,పట్లోల్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్స్ కోరబోయిన నాగరాజు నాని,తుపాకుల సునిల్,శరత్ బాబు, పిట్ల లక్ష్మణ్,కో ఆప్షన్ మెంబెర్ ప్రవీణ్,ఆత్మ కమిటీ సభ్యులు చిట్యాల మధు, ఖలేద్,నాయకులు దాకూరి శ్రీనివాస్,బేగారి అనిల్,ఆకుల నందు,కొత్త శ్రీశైలం,గొహేర్ అలీ,అబ్బాస్ అలీ,మురళి బండల సంతోష్,తదితరులు పాల్గొన్నారు

# గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్



బోథ్. సెప్టెంబర్ 2. (విజన్ ఆంధ్ర) : ఆదిలాబాద్ జిల్లా బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లాపూర్ గ్రామ శివారులో వ్యవసాయ క్షేత్రంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని బోథ్ పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం, పోలీస్ సిబ్బంది మరియు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి గొల్లాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆత్రం లచ్చు (35), గొల్లాపూర్ గ్రామం, సోనాల మండలం అనే వ్యక్తి వ్యవసాయ క్షేత్రంలో పత్తి పంట మధ్యలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ పరిశీలించి అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. మొత్తం 5 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.50,000 గా అంచనా వేశారు. నిందితుడు తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి సాగు చేసి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడిపై ఎండీపీఎస్ చట్టం ప్రకారం బోథ్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. బోత్ సీఐ డి. గురుస్వామి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా మరియు విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల సాగుకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వంగూరులో ఘనంగా శ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు

**- అమ్మవారిని దర్శించుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



వంగూరు, సెప్టెంబర్ 02 (విజన్ ఆంధ్ర): వంగూరులో కొలువైన శ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా జరుగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు రాఘవేందర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్రీ గెల్వలాంబ మాత ఆశీస్సులు వంగూరు ప్రజలందరిపై సదా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తనను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నకిరమోని శేఖర్, వైస్ చైర్మన్ మురళీ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, సీనియర్ నాయకులు మల్లేష్, సుమన్, చక్రవర్తి, సురేష్, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల నియంత్రణకు చర్యలేవి?

**- వీధి కుక్కలకు వింత రోగాలు... పట్టించుకోని అధికారులు**



గోపాల్ పేట సెప్టెంబర్ 02 :(విజన్ ఆంధ్ర) : గోపాల్‌పేట మండల కేంద్రంలోని పలు వీధుల్లో వింత రోగంతో వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. కుక్కల గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోని వైనం కనిపిస్తోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుంపులు గుంపులుగా తిరుగుతూ కుక్కలు, పిల్లలు, వృద్ధులు, పశువులపై దాడులు చేస్తున్నాయి. గోపాల్‌పేట మండల కేంద్రంలో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరిగి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. వీధి కుక్కలు పలువురు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలు ఇదివరకే చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. మనుషులపైనే కాకుండా పశువులు, కోళ్లు, మూగజీవులను సైతం గాయపరుస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద కుక్కల స్వైర విహారం...**

లిగోపాల్‌పేటలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద కుక్కలు తిరుగుతుండడం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు, సిబ్బంది తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే కుక్కలకు నిర్బంధ టీకాల కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున గోపాల్‌పేట మండల కేంద్రంలో వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# నిజామాబాద్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో ప్రెస్ మీట్ నిర్వహించినా జిల్లా నాయకులు

**- టీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గం అధ్యక్షులు మంతెన నవీన్ రెడ్డి**




నిజామాబాద్ సెప్టెంబర్02:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ పాంచజన్య సంకల్ప సభ విజయవంతం చేసిన జిల్లా ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నము అన్నారు.ఏదైతే పాంచజన్య సంకల్ప సభ లో మా నాయకురాలు కవితక్క గారు తనకు జరిగిన అన్యాయాన్ని గురించి మాట్లాడడం జరిగింది.సభ లో నిజామాబాద్ మాజీ బిఆర్ఎస్ ఏమ్మెల్యే లు చేసిన అవినీతిని వారు తనకు చేసిన మోసాన్ని ఎండగట్టడంతో నిన్న కానీ ఈ రోజు మాట్లాడిన మాజీ బిఆర్ఎస్ ఏమ్మెల్యే లకు కౌంటర్ ఇచ్చిన జిల్లా నాయకులు. ఏదైతే నిన్న ప్రశాంత్ రెడ్డి మా నాయకురాలి గురించి మాట్లాడుతూ కొన్ని మాటలు మాట్లాడడం జరిగింది ,ఈ రోజు ప్రశాంత్ రెడ్డి గారికి ఈ ప్రెస్ మీట్ ద్వారా చెప్పేది ఒక్కటే మొదటి సారి ఎలక్షన్ లో గెలిచాక మా కవితక్క దగ్గరకి వచ్చి అక్క మీరు మాకోసం చాలా కష్టపడ్డారు అని నివు ఆర్మూర్ జీవన్ రెడ్డి కళ్ళు మొక్కిన మాట నిజం కదా అని అడుగుతున్న నీ తీరు అందితే కళ్ళు లేకుంటే జుట్టు పట్టే రకం ఉంది ,ఈ రోజు నువు బాల్కొండ లో ఏమి అవినీతి చేస్తున్నావో ప్రజలకు తెల్వది అనుకుంటున్నావ్ బట్టపూర్ క్వారీ లో ఎన్ని అక్రమాలు చేస్తున్నావో నీ అవినీతి చిట్టా అంత ఉంది అమాయక యువకుల మీద కేసు పెట్టి వారి జీవితాలను నాశనం చేసిన చరిత్ర నిధి,నివు మంత్రి గా ఉన్నప్పుడు ఎలా వ్యవహరించావో ప్రజలందరికీ తెలుసు నీ పతనం మొన్ననే అయిపోతుండే ఏదో లక్కీగా గెలిచి బయట పడ్డావ్ ఇంకోసారి మా నాయకురాలి మీద మీరు కానీ మీ అనుచరులు కానీ అనుచితంగా మాట్లాడితే సహించేది లేదని ఈ వేదిక ద్వారా హెచ్చరిస్తున్నా అన్నారు జిల్లా నాయకులు దొంత ప్రవీణ్ బోధన్ మాజీ ఏమ్మెల్యే షకీల్ తీరును ఎండగడుతూ కవిత అక్క గారితో బిఆర్ఎస్ లో ఉన్నప్పుడు అక్క గారితో సన్నిహితంగా ఉంది పనులు చేసుకున్న నీకు గతం మర్చిపోయావా షకీల్ అన్నారు ఇప్పటికైనా మా నాయకురాలి మీద మాట్లాడం బంద్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న బాధల మీద మీ దృష్టి పెట్టండి అన్నారు జిల్లా నాయకురాలు విజయ లక్ష్మి బీజేపీ ఎంపీ అరవింద్ వారి అనుచరులకు కౌంటర్ ఇచ్చారు అభివృద్ధి చేయడం చేతాగని ఎంపీ ఎవరన్న ఉన్నారు అంటే అది ధర్మపురి అరవింద్ అన్నారు ఎన్ని ఏండ్లు గడుస్తున్నా మాధవనగర్ బ్రిడ్జి పూర్తి చేయడానికి నీకు చేస్తా అయితలేదు నిజామాబాద్ అభివృద్ధి గురించి మాట్లాడితే ఈ రోజు నీ అనుచరులతోప్రెస్ మీట్ మాట్లాడిస్తున్నావు అభివృద్ధి చేతాగాదని ఈ రోజు మహిళా నాయకురాలు తో పెట్టించిన ప్రెస్ మీట్ తేట తెల్లం అయిపోయింది జిల్లా నాయకులు నిజామాబాద్ రూరల్ నాయకులు నరేష్ మాట్లాడుతూ మా నాయకురాలు జిల్లా కు పార్టీ స్థాపించి మొదటి సారి గా విచ్చేసినందుకే మా నియోజకవర్గం బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కు దడ పుట్టింది అయిన ఏమ్ మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం అవుతలేదు అయ్య బాజిరెడ్డి మా కవితక్క మీరు ఏమీ అభివృద్ధి చేశారో ఎండగట్టింది దానికే మీరు ఆగం అయిపోయి ప్రశాంత్ రెడ్డి చెప్పితే ప్రెస్ మీట్ పెట్టి ఏము మాట్లాడాలో తెల్వక మాట్లాడుతున్నారు షోకాజ్ నోటీస్ ఇచ్చారా సస్పెండ్ లెటర్ ఇచ్చారా తెలుసుకొని మాట్లాడండి అన్నారు

# గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

***శాంతి కమిటీ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి: పోలీస్ కమిషనర్ వెల్లడి***



నిజామాబాద్ సెప్టెంబర్02:( విజన్ ఆంధ్ర ) : గణేష్ చవితి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ యందు నిర్వహించారు. ఈ సమావేశానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., హాజరై గణేష్ ఉత్సవాల నిర్వహణ , భద్రతా ఏర్పాట్లు , శాంతిభద్రతలు , ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై శాంతి కమిటీ సభ్యులు , గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన , సోదరభావంతో కూడిన శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ అనేది ప్రజలందరినీ ఐక్యం చేసే కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు.గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవడంతో పాటు , పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు , అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ , పార్కింగ్ , జనసందోహం నియంత్రణకు నిర్వాహకులు ప్రత్యేకంగా సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలు , సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు , సమయ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కూడా నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని ముందుగా నిర్ణయించిన మార్గాలు , సమయాలను పాటించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో పాల్గొనే వారు ఎలాంటి రెచ్చగొట్టే నినాదాలు , వివాదాస్పద చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు , వదంతులను నమ్మవద్దని , ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని , గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా , సురక్షితంగా , విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని అవసరమైన భద్రతా చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా శాంతి కమిటీ సభ్యులు , గణేష్ మండపాల నిర్వాహకులు , ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి మత సామరస్యాన్ని , శాంతిభద్రతలను కాపాడుతూ గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సార్వజనీక కమిటీ యొక్క సూచనల ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏ.సి.పి శ్రీ ప్రకాష్ యాదవ్, ఏ.సీ.పి ట్రాఫిక్ శ్రీ మస్తాన్ అలీ , నిజామాబాద్ టౌన్ సీ ఐ శ్రీనివాస్ రాజ్ , టౌన్ 1 ఎస్ హెచ్ ఓ రఘుపతి , 4 టౌన్ ఎస్.హెచ్. ఓ శ్రీ సతీష్ , నార్త్ సి.ఐ శ్రీనివాస్ సౌత్ సీ ఐ సురేష్ , ఎస్. ఐ లు మరియు సార్వజని గణేష్ మండలి సభ్యులు , గణేష్ మండలి నిర్వాహకులు , ఆర్గనైజర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# సిద్దిపేటలో మున్నూరు కాపు పట్టణ , గ్రామీణసంక్షేమ సంఘం ఏర్పాటు

**- మున్నూరు కాపు కులబంధువులందరినీ ఏకతాటిపై నడిపించడమే మా లక్ష్యం**
**- చీల్చడం మా ఉద్దేశం కాదు మున్నూరు కాపుల అందరిని అక్కున చేర్చుకుంటాం**
**- రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పిలుపు**




సిద్దిపేట జిల్లా, ప్రతినిధి 02 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నూతనంగా ఏర్పాటుచేసిన మున్నూరు కాపు పట్టణ మరియు గ్రామీణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మీటింగ్ లో మాట్లాడుతూ. కొంతమంది సంఘాన్ని చీలుస్తున్నారన్న ఉద్దేశం గా మాట్లాడుతూ ఇది చీల్చడం కాదు మన మున్నూరు కాపు సంఘం సభ్యులందరికీ ఏకతాటిపై నడిపించడమే మా యొక్క ఉద్దేశమని ఆయన అన్నారు గతంలో కేసీఆర్ ఇచ్చిన పట్టణంలో ప్రస్తుతం పట్టణ సంఘం ఉందని, గ్రామీణ ప్రాంతంలో కుల బాంధవులు సభ్యత్వం లేకపోవడంతో నానా ఇబ్బందులుఎదుర్కొంటున్న ఉద్దేశంతో ఈ సంఘాన్ని స్థాపించడం జరుగుతుందని, ఈ సంఘం ఆ సంఘం వారికి ఎలాంటి భావనలు లేవని మనమంతా ఒకటే అని ఆయన అన్నారు అనంతరం ఈ సంఘం కొరకు ఒక రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని. ఆ సంఘం కేసీఆర్ ఇచ్చిందేనని ఈ సంఘం స్థలం కూడా ప్రస్తుత మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లి స్థల సేకరణ విషయంలో అందరం కలిసికట్టుగా కొట్లాడి స్థలాన్ని తీసుకుందామని అన్నారు మాజీ మార్కెట్ చైర్మన్ పాల సాయిరాం మాట్లాడుతూ వయసులో మీ అందరికంటే చిన్నాయన నేను తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అన్నారు. సంఘం యొక్క స్థల విషయంలో మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లి స్థల సేకరణకు నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఆర్థికంగా లేనివారు ఇల్లు లేని వారికి సభ్యత్వం ఇవ్వాలని ఉద్దేశంతో ఈ సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం గనుల భగవాన్ మాట్లాడుతూ ఉన్నటువంటి సంఘంలో కొంతమంది సభ్యుల పై సస్పెన్షన్ వేస్తూ తీవ్ర మనోవేదనకు గురి అయ్యేటట్లు చేస్తున్నారని పద్ధతి మానుకోవాలని మెంబర్షిప్ విషయంలో నేను కాళ్ళ వేళ్ళ వాటిని నన్ను తొలగించిన కారణం ఇప్పటివరకు చెప్పలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం అంటే అందరి ఐక్యత ఉంటేనే సంఘం గా ఉంటుంది కానీ కొందరు పెద్ద మనుషులు మా పదవులు ఎక్కడ ఊడుతాయని, న్యాయం చేయకుండాచెప్పినవారికి చెవులు ఊపుతూ న్యాయం న్యాయం చేయాల్సిన పెద్దలే నోరు మెదపడం లేదని ఆయన అన్నారు. దేవులపల్లి ఎల్లయ్య మీడియా అధ్యక్షులు మాట్లాడుతూ కొందరు చేసిన వాదన అది సరైనది కాదని ఇది చీల్చడం కాదు ఇది అందరినీ ఏకం చేయడమే ఈ సంఘం యొక్క ఉద్దేశమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పదవుల కొరకు పదవుల కొరకు అని ఇతరులను అంటూ వారే మా పదవులు ఎలా పుడతాయో అని ఒక వర్గానికి కొమ్ములు కాస్తున్నారని ఆయన అన్నారు. ఈ విషయంలో ఆర్థిక స్థితిగతులను ఉద్దేశించుకుని కొంతమంది వాళ్ళు పెట్టే మెంబర్షిప్ యొక్క అమౌంట్ చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు కాబట్టి కొంతమంది ఇల్లు లేని మున్నూరు కాపు కుటుంబాలు కూడా పట్టణంలో నివసిస్తున్నాయి కాబట్టి వారు అందరి ఐక్యత చాటాలని ఉద్దేశంతో ఈ సంఘం స్థాపించామని ఇది కేవలం అతి తక్కువ సమయంలో ఇంత మంది ఇక్కడ సమావేశం అవడం ఎంతో సంతోషదాయకమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆకుల బాలయ్య మాట్లాడుతూ సంఘాన్ని సంఘటితం చేయడం కోసం స్థాపించారు. గ్రామ గ్రామాన అహర్నిశలు కష్టపడి ఈ మెంబర్లను తయారు చేసి ఇంతవరకు తీసుకువచ్చారు ఈ సభ్యులందరం ఏకంగా వచ్చే ఎన్నికల్లో గాని మన సభ్యులు ఎవరు పోటీ చేసిన ఆయనకు సపోర్టుగా నిలవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొండ దేవయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, సిద్దిపేట మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు నాయక మల్లయ్య, దేవులపల్లి ఎల్లయ్య, ఆకుల బాలయ్య, గాండ్ల భగవాన్, గాండ్ల శ్రీనివాస్, అధ్యక్షులు సిరినేని నాగభూషణం, ఇప్ప దేవరాజ, మరియు సర్పంచులు, గ్రామ వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆకలి తీర్చడమే లక్ష్యం

**- మంచిర్యాలలో మెగా కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం**










మంచిర్యాల టౌన్ : సెప్టెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంచిర్యాల పట్టణంలో నూతనంగా నిర్మించిన అధునాతన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్ రావు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో ని మెడికల్ గోడౌన్ లో ఈ కిచెన్ ను ఏర్పాటు చేశారు.సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధుల ఆర్థిక సహకారంతో నిర్మించిన ఈ కేంద్రానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వహణ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ప్రతిరోజూ 50,000 మందికి ఆహారం తయారుచేసే సామర్థ్యం ఉన్న ఈ కిచెన్ ద్వారా మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని 17 మండలాల్లో గల 691 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు (42,450), 13 జూనియర్ కళాశాలల విద్యార్థులు (6,654) లబ్ధి పొందనున్నారు.

**అధునాతన సాంకేతికత పకడ్బందీ వసతులు**

ప్రభుత్వం కేటాయించిన 8,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కిచెన్‌లో ఆహార నాణ్యత, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. అందుకోసం ప్రత్యేకంగా ఫుడ్ ల్యాబ్, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, ఆటోమేటిక్ వెజిటబుల్ కటింగ్ మెషీన్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్ మరియు సెంట్రల్ గ్యాస్ బ్యాంక్ లను అమర్చారు.

**అల్పాహారం తయారీ యంత్రాలు మరియు వాటి పనితీరు..**

ఇడ్లీ యంత్రం: గంటకు 5,600 ఇడ్లీలు.
దోశ యంత్రం: గంటకు 2,000 దోశలు.
పూరీ యంత్రం: గంటకు 3,600 పూరీలు.
వంట సామర్థ్యం: కేవలం 40 నిమిషాల్లో 1,000 మందికి సరిపడా అన్నం, 2 గంటల్లో 5,000 మందికి పప్పు/సాంబార్ తయారీ.

**ఎన్ఐఎన్ ప్రమాణాలతో పౌష్టికాహార మెనూ**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచనల మేరకు విద్యార్థుల పెరుగుదలకు అవసరమైన పోషకాలు లభించేలా వారం రోజుల మెనూను సిద్ధం చేశారు:
సోమవారం: ఇడ్లీ సాంబార్
మంగళవారం: పూరీ ఆలూ కుర్మా
బుధవారం: దోశ చట్నీ
గురువారం: ఉప్మా చట్నీ
శుక్రవారం: మిల్లెట్ ఇడ్లీ సాంబార్
శనివారం: బోండా చట్నీ

విద్యార్థులు ఉదయాన్నే ఖాళీ కడుపుతో బడికి రాకుండా, ఆరోగ్యకరమైన అల్పాహారం ద్వారా చదువుపై శ్రద్ధ వహించాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస స్వామీజీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

# ప్రజలకు నరకం చూపిస్తున్న పత్తిపల్లి రోడ్డు

- నిద్రావస్థలోఅధికారులు ..
- బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రాకేష్ యాదవ్ ధ్వజం.



ములుగు సెప్టెంబర్ 02: ములుగు మున్సిపాలిటీలో పత్తిపల్లి రోడ్డు విస్తరణ పనుల పేరుతో పది నెలలుగా ప్రజలను పీడిస్తున్న అధికారుల తీరుపై బీజేపీ ములుగు అర్బన్ అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రోడ్డు వేస్తున్నారా? ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారా?" అంటూ నిప్పులు చెరిగారు. మార్కింగ్‌లు వేయడం, చెరిపేయడం తప్ప 10 నెలలుగా చేసిందేమీ లేదని, ఇది అధికారుల చేతగానితనానికి, నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. ముఖ్యంగా మున్సిపల్ ఆఫీస్ ముందు గల రోడ్డు నుంచి పత్తిపల్లి రోడ్డులోకి వెళ్లే రోడ్డు రెండు చివర్లలో కనీసం మొరం కూడా పోయకుండా, స్ట్రీట్ రోడ్లకు అనుసంధానం చేయకుండా అలాగే వదిలేశారని, దీంతో వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అయితే అభివృద్ధి చెందుతుందని భావించిన ప్రజలకు తీవ్ర నిరాశ మిగిలిందని, ములుగు మున్సిపాలిటీ ప్రజల సహనానికి శాపంగా మారిందని, ప్రజల సహనాన్ని పరీక్షించొద్దని హెచ్చరించారు. రోడ్డంతా దుమ్ముమయంగా మారిందని, వాహనదారుల ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో అవి మృత్యుకూపాలుగా మారాయని, ఏ క్షణంలో ఎవరి ప్రాణం పోతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొందని అన్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా నిద్రలేవాలని, వెంటనే పనులకు స్పష్టమైన డెడ్‌లైన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రాకేష్ యాదవ్ గట్టిగా హెచ్చరించారు.

# యూరియా కోసం చెప్పులతో క్యూ లైన్.

- సర్వర్ సమస్యతో రెండు గంటలుగా రైతుల నిరీక్షణ..
- ఎండతీవ్రతతోతిప్పలు
- 1100బస్తాలుఅందుబాటులో ఉన్నా పంపిణీకి సాంకేతిక ఆటంకం



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర : యూరియా కోసం రైతుల కష్టాలు తప్పడం లేదు. మండలకేంద్రమైన పావన్నపేట సొసైటీలో యూరియా నిల్వలు అందుబాటులోకి రావడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే సర్వర్ సమస్య తలెత్తడంతో సుమారు రెండు గంటల పాటు పంపిణీకి అంతరాయం ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొన్నారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా రైతులు సొసైటీ వద్ద బారులు తీరారు. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో తెలియక నిరీక్షించిన పలువురు రైతులు ఎండలో నిలబడలేక తమ చెప్పులను క్యూలో పెట్టి వంతు స్థానాలను కాపాడుకున్న దృశ్యం అక్కడ కనిపించింది. సొసైటీలో సుమారు 1100 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ సాంకేతిక సమస్య కారణంగా పంపిణీలో జాప్యం ఏర్పడింది. దీంతో యూరియా కోసం వచ్చిన రైతులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. యూరియా ఉంది.. కానీ సర్వర్ సహకరించలేదు! అన్నట్లుగా పరిస్థితి మారింది. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజును వివరణ కోరగా సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో రైతులకు కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. సమస్యను పరిష్కరించి యూరియా పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. యూరియా కోసం ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న తమకు సర్వర్ సమస్యలు మరింత భారంగామారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అన్‌మ్యాప్డ్, అనామలీస్ కేటగిరీల ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పరిష్కారానికి రాజకీయ పార్టీ ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవగాహన కల్పించి, నిర్దేశిత గడువులోగా తగిన ఆధార పత్రాలు సమర్పించేలా ప్రోత్సహించాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషన్ సూచించిన 11 రకాల డాక్యుమెంట్లలో ఏదైనా ఒకదానిని అర్హత నిరూపణ కోసం సమర్పించవచ్చని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, కేవలం అధికారిక ప్రకటనల ఆధారంగానే ఆధారాలు అందజేయాలని స్పష్టం చేశారు. అలాగే, 18 సంవత్సరాలు పూర్తయిన నూతన ఓటర్ల నమోదు కోసం సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన యువత ఆయా పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎన్నికల అధికారులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 420 ఫీట్ల ఫ్లెక్సీతో కాంగ్రెస్ ను నిలదీసిన బీఆర్ఎస్





ములుగు సెప్టెంబర్ 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ ఉద్యమానికి పురుడుపోసిన ములుగు గడ్డపై బుధవారం గులాబీ జెండా రెపరెపలాడింది. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ములుగులో 420 ఫీట్ల ఫ్లెక్సీతో భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు సాగిన ర్యాలీకి జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, నియోజకవర్గ ఇంఛార్జ్ బడే నాగజ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి 1,000 రోజులైనా ఒక్క హామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. 6 గ్యారంటీలు కాగితాలకే పరిమితమయ్యాయని, మహాలక్ష్మి కింద రూ.2500, తులం బంగారం, స్కూటీ, రైతు భరోసా రూ.15 వేలు, 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇది కేవలం జెండా తిరుగుబాటు కాదు, మోసపోయిన ప్రజల తిరుగుబాటు అని, ఇప్పటికైనా హామీలు నెరవేర్చకపోతే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

# వైద్య కళాశాల, జీజీహెచ్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి
- ఈ నెల 17న నర్సింగ్ కళాశాల, హాస్టల్, మెడికల్ కళాశాల
- స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి
- సింగూర్ కాలువల లైనింగ్, కట్ట మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి, డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 2:– జిల్లాలో వైద్య, ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్), నర్సింగ్ కళాశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించి ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, సంగారెడ్డి, జోగిపేట నర్సింగ్ కళాశాలలు, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, అవసరమైన పరికరాలు, నిర్వహణ, పెండింగ్ పనులు, భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, గర్ల్స్, బాయ్స్ హాస్టళ్లలో అవసరమైన సౌకర్యాలు, పరికరాలు, చేపట్టాల్సిన అదనపు పనులపై కళాశాల ప్రిన్సిపాల్‌ను మంత్రి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసానికి అనుకూలమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. జీజీహెచ్‌లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, వాటి నిర్వహణ, భవన నిర్వహణ, రోగుల సంరక్షణ, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల, హాస్టళ్లు, జీజీహెచ్‌కు సంబంధించిన వార్షిక నిర్వహణ అవసరాలను కళాశాల ప్రిన్సిపాల్, జీజీహెచ్ అధికారులతో సమన్వయం చేసుకుని, ఒక్కో అంశాన్ని గుర్తించి అవసరమైన పనులకు ప్రాధాన్యతా క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. జీజీహెచ్ భవన నిర్వహణ, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ, మెడికల్ కళాశాల శానిటేషన్, సెక్యూరిటీ, ఎస్‌టీపీ నిర్వహణ, పీజీ గర్ల్స్ హాస్టల్, ఆడిటోరియం తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. మెడికల్ కళాశాల, జీజీహెచ్ నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న అన్ని ఏజెన్సీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పనుల నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని వైద్య పరికరాలకు సంబంధించిన పూర్తి వివరాలు, వాటి పనితీరు, వినియోగం, మరమ్మతులు, అవసరమైన అదనపు పరికరాలపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాల వివరాలను తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు నిరంతరాయంగా, నాణ్యతా ప్రమాణాలతో అందించాలని సూచించారు. మెడికల్ కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపించాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి, జోగిపేట నర్సింగ్ కళాశాలల అభివృద్ధి పనులు, నర్సింగ్ హాస్టళ్ల పురోగతి, విద్యార్థుల సంఖ్య, టీచింగ్ ఫ్యాకల్టీ, అవసరమైన పరికరాలు, వసతి సౌకర్యాలు తదితర అంశాలపై సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను మంత్రి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా నర్సింగ్, మెడికల్ కళాశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ నెల 17న సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, నర్సింగ్ హాస్టల్, మెడికల్ కళాశాల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవితో జిల్లాలో పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తదితర వైద్య సంస్థలపై మంత్రి సమీక్షించారు. ఆయా ఆసుపత్రుల్లో మిగిలిన చిన్నచిన్న పనులు, పరికరాల ఏర్పాటు, సిబ్బంది, ఇతర అవసరాలను వెంటనే పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులతో సింగూర్ ప్రాజెక్టు పరిధిలోని కాలువల లైనింగ్ పనులు, కట్ట మరమ్మతులు, ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో, డెడ్ స్టోరేజ్, సగటు నీటిమట్టం, నీటి నిల్వ సామర్థ్యం, పూర్తయిన పనులు, ఇంకా అవసరమైన నిధులపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. కాలువల లైనింగ్, కట్ట మరమ్మత్తు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి సంరక్షించాలని సూచించారు. కాలువల పరిరక్షణకు అవసరమైన చర్యల్లో భాగంగా పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కాలువల పనులు, అవసరమైన నిధులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించి అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనులన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, మెడికల్ , నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖల అధికారులు, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజల జీవి తాలు చిద్రం....

## మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా తీవ్ర ధ్వజం....



నిజామాబాద్,సెప్టెంబర్ 2, (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా 6 గ్యారెంటీలు,420 హామీలను అమలు చేయకుండా ప్రజ ల జీవితాలను ఛిద్రం చేసింది అని,బిఆర్ఎస్ నాయకు డు,నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే, బిగాల గణేష్ గుప్తా ధ్వజమెత్తారు.బుధవారం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా నిజామాబాద్ నగరంలోని ధర్నా చౌక్ లో బిఆర్ఎస్ అద్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ..ప్రభుత్వానికి పని చేసేందుకు సమయం ఇచ్చినా మార్పు రాకపోవడంతో,అధినేత కేసీఆర్ ఆదేశా ల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు దిగాయని అన్నారు.420 హామీలతో కూడిన 420 అడు గుల భారీ ఫ్లెక్సీని ప్రజల ముందు ప్రదర్శించారు.ఈ నిరస నలు వారం రోజుల పాటు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినందుకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పి,ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి అని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఎగనామం పెట్టిన స్కీములు,నిధుల వివరాలతో కూడిన బాకీ కార్డులను 26వ డివిజన్ కోటగల్లిలో ఇంటింటికీ పంపిణీ చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్త యినా ప్రజల జీవితాలు ఛిద్రమయ్యాయని,ఎన్నికల హామీలను గాలికొదిలేసి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలను నిలువునా దోచుకుంటుందని బిగాల గణేష్ గుప్తా తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు.అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీ లు,420 హామీలు వెయ్యి రోజులైనా అమలుకు నోచు కోలేదని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో కొత్తగా ఏర్ప డిన ఏ ప్రభుత్వానికైనా పనిచేసేందుకు కొంత సమయం ఇవ్వాలనే సదుద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గారు ఇన్నాళ్లు వేచి చూశారని ఆయన గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రజలను నిరంతరం మోసం చేస్తుండటం తో,ఇక చూస్తూ ఊరుకోబోమని,కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ పిలుపులో భాగంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో నిజామాబా ద్ నగరం లోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కాంగ్రెస్ ఇచ్చిన 420 వాగ్దానాలను ఎండగడుతూ రూపొందించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రజల సమక్షంలో ప్రదర్శించారు. ఈ ఆందోళన కార్యక్రమాలు వారం రోజుల పాటు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి,ఇచ్చిన అన్ని హామీ లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇస్తామని ఎగనామం పెట్టిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు రావాల్సిన డబ్బుల వివరాల ను 'బాకీ కార్డు'రూపంలో రూపొందించారు.నిజామాబా ద్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిర్ప రాజు ఆధ్వ ర్యంలో 26వ డివిజన్ పరిధిలోని కోటగల్లి ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ఈ బాకీ కార్డులను పంపిణీ చేసి,కాంగ్రె స్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్ర మంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి,నాగారం నర్సింగ్ ,నవీద్ ఇక్బాల్,జగత్ రెడ్డి,అబ్దుల్ మతీన్, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,డివిజన్ ఇంచార్జ్లు లు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా ప్రయోజనాలకే మోడల్ మార్కెట్ భవనం కేటాయించాలి

- తూడిమెళ్ల మల్లికార్జున్
- కౌకూర్ లో 7వ రోజు కొనసాగుతున్న ధర్నా



అల్వాల్, సెప్టెంబర్ 2, (విజన్ ఆంధ్ర): కౌకూర్ మోడల్ మార్కెట్ ను ప్రజా ప్రయోజనాలకే కేటాయించాలని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తూడిమెళ్ల మల్లికార్జున్ కోరారు. కౌకూర్ మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ శాఖకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన ధర్నా బుధవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన, మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ ను , అలాగే కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ,మ ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎక్సైజ్ కార్యాలయానికి చేసిన కేటాయింపును రద్దు చేసి భవనాన్ని ప్రజా అవసరాలకు వినియోగించాలని తూడిమెళ్ల మల్లికార్జున్ కోరారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, మోడల్ మార్కెట్ భవనాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించే అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గోమారం అంజిరెడ్డి, అల్లి మల్లేష్, వేణు గౌడ్, వెంకటేష్, జనార్ధన్, జలీల్, అహ్మద్, అబ్బా, వివిధ కాలనీలకు చెందిన ప్రజలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు హామీల వర్షం

- అధికారంలోకి వచ్చాక ప్రజలకు కన్నీళ్ల వరద
- బీజేపీ జిల్లా అధ్యక్షులు,దినేష్ పటేల్ కులాచారి
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా




నిజామాబాద్ సెప్టెంబర్02:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలన తెలంగాణ ప్రజలకు చీకటి రోజులుగా మిగిలిపోయిందని అన్నారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్క హామీని ఒక్కొక్కటిగా పక్కన పెడుతూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే ఇలాంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. వైద్య రంగంలో కూడా ప్రజలకు సరైన భరోసా లేకుండా పోయిందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాలు, సిబ్బంది, మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. సాగునీటి విషయంలో ఇందూరు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని దినేష్ పటేల్ కులాచారి అన్నారు. నిజామాబాద్ జిల్లా వ్యవసాయాధారిత జిల్లా అని తెలిసినా రైతులకు అవసరమైన సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధి, పెండింగ్ పనులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. "ఇందూరుపై సీఎం రేవంత్ రెడ్డికి ఎందుకింత కక్ష?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రకటిస్తున్న ప్రభుత్వం ఇందూరు విషయంలో మాత్రం ఎందుకు వివక్ష చూపుతోందని నిలదీశారు. నిజామాబాద్ జిల్లాకు ఎంతోకాలంగా ఉన్న ఎయిర్‌పోర్ట్ డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన రాజజ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఇందూరు ఎయిర్‌పోర్ట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సమయం లేదా? అని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్ట్ వస్తే నిజామాబాద్ జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉన్నా.. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. ప్రజల సమస్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సమయం లేకపోయినా.. ఇటుక బట్టీలు, ఇసుక, మొరం కుప్పల విషయంలో మాత్రం ఆసక్తి చూపుతున్నారనే విమర్శలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయని దినేష్ పటేల్ కులాచారి అన్నారు. ప్రజలకు సేవ చేయడానికి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ముందుగా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు ఇచ్చిన హామీలు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారంలో గొప్పలు చెప్పుకోవడం మానేసి.. 1000 రోజుల్లో ప్రజలకు ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని, హామీలను నమ్మి ఓటేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై బీజేపీ మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తుందని, ఇందూరు అభివృద్ధి కోసం బీజేపీ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని దినేష్ పటేల్ కులాచారి స్పష్టం చేశారు. "1000 రోజుల పాలనకు సంబరాలు కాదు.. ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానాలు చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి.. ప్రజల తీర్పు తప్పదు." ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతన్ కార్ లక్ష్మీనారాయణ, నగ్గోల్ల లక్ష్మీనారాయణ, బద్దం కిషన్, బొబ్బిలి వేణు గోపాల్, చింత శ్రీనివాస్ రెడ్డి, ఓం సింగ్ నాయక్, పురుషోత్తం, అమంద్ విజయ్ కృష్ణ, నాయిడి రాజన్న, శంకర్ రెడ్డి, ఆనంద్, అన్నం గోపి, పడాల భూపతి, మారెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో ఇక సర్టిఫికెట్ల కష్టాలు కట్

- ఇంట్లోనే బర్త్, డెత్ సర్టిఫికెట్లు!




తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 02: హైదరాబాద్ ప్రజలకు ఇది నిజంగా గుడ్ న్యూసే. ఇన్నాళ్లూ బర్త్ సర్టిఫికెట్ కావాలంటే మీ సేవ కేంద్రం చుట్టూ, జిహెచ్ఎంసి ఆఫీసు చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. దళారులకు డబ్బులు పోయాలి, నెలల తరబడి ఎదురుచూడాలి. కానీ ఇప్పుడు ఆ కష్టాలన్నింటికీ కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. కేంద్రం తీసుకొచ్చిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అనే కొత్త విధానంతో ఇకపై అంతా ఆన్ లైన్ లోనే జరిగిపోతుంది. హైదరాబాద్ లోని జిహెచ్ఎంసి తో పాటు మణికొండ, మల్కాజ్ గిరి మున్సిపాలిటీల పరిధిలో ఈ విధానాన్ని ట్రయల్ గా అమలు చేసి సక్సెస్ అయ్యారు. త్వరలోనే నగరమంతా, ఆ తర్వాత రాష్ట్రమంతా ఇదే విధానం రాబోతోంది. ఇకపై ఆసుపత్రిలో బిడ్డ పుట్టగానే ఆసుపత్రి సిబ్బందే ఆ వివరాలను నేరుగా సి ఆర్ ఎస్ పోర్టల్ లోకి పంపిస్తారు. మీరు ఇంట్లో కూర్చొని ఫోన్ లోనే అప్లై చేస్తే చాలు, అధికారులు వెరిఫై చేసి క్యూఆర్ కోడ్ తో కూడిన పక్కా సర్టిఫికెట్ ని ఆన్ లైన్ లోనే ఇచ్చేస్తారు. మీరు అక్కడే డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అందులోనూ 30 రోజుల్లోపు నమోదు చేస్తే ఒక్క రూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేదు, పూర్తిగా ఉచితం. దీంతో ఇకపై మీ సేవల ముందు క్యూలు, దళారుల దోపిడీకి పూర్తిగా ఫుల్ స్టాప్ పడినట్లే.

# విశేషంగా అలరించిన "ఘంటసాల పాట చిన్నారుల నోట" సుస్వర గానలహరి



హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : దిగ్గజ భారతీయ నేపథ్య గాయకుడు, స్వరకర్త అయిన పద్మశ్రీ, ఘంటసాల వెంకటేశ్వరరావు శాశ్వత వారసత్వాన్ని స్మరించుకోవడానికి ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ వేదిక, ప్రముఖ సాంస్కృతిక సదస్సు "అంతర్జాతీయ ఘంటసాల సంగీత వైభవ వేదిక"సగర్వ సమర్పణలో "ఘంటసాల పాట చిన్నారుల నోట" పేరిట అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అమృత గానాలను చిన్నారుల మధుర స్వరాలతో నిర్వహించిన అపూర్వ సంగీత సుస్వర గానలహరి కార్యక్రమం సంగీత ప్రియులని, ప్రేక్షకులను విశేషంగా అలరించింది, ఆకట్టుకుంది. మంగళవారం నాడు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ. ఎన్.టి.ఆర్. ఆడిటోరయం, నాంపల్లి, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఈ సుమధుర ఘంటసాల సంగీత గానలహరి లో చిన్నారులు, వర్ధమాన గాయనీ గాయకులు విశేషమైన ప్రతిభతో అద్భుతంగా ఘంటసాల ఆణిముత్యాలను ఆలపించి అందరి హృదయాలను దోచుకున్నారు. కార్యక్రమ నిర్వాహక కమిటీ సభ్యులు బి. శ్రీనివాస నార సింగ్,యర్క్, యు కె, కె . కృష్ణ డల్లాస్ , టి యక్స్ , యు ఎస్ ఎ, డాక్టర్ . కె . వి . రావు హైదరాబాద్ , గురప్ప రామమూర్తి చెన్నై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సుమధుర గాన లహరి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఘంటసాల మూవీ ప్రొడ్యూసర్ , డైరెక్టర్ సి. హెచ్ రామారావు హాజరై ఎంతో మధురంగా పాటలను పాడిన చిన్నారులను, గాయనీ గాయకులను అభినందించి, ప్రశంశించి పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు. చిన్నారులలో ఉన్న ప్రతిభను వెలికితీస్తూ వారిని గొప్ప గాయకులుగా తీర్చిదిద్దుతున్న 'అంతర్జాతీయ ఘంటసాల సంగీత వైభవ వేదిక' సంస్థ నిర్వాహకులను ఈ సంధర్భంగా ఆయన అభినందించారు.

# విమర్శలు మాని.. చేసిన అభివృద్ధిపై మాట్లాడండి

**- డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నేతలు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గంలోని సోలిపూర్ నుంచి ఖిల్లా ఘనపురం వరకు బుధవారం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజాపక్షాన ఉన్నట్లు నటించడం విడ్డూరంగా ఉంది. తమ హయాంలో ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారో ప్రజలకు ముందస్తుగా సమాధానం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలలో ఎన్ని నెరవేర్చిందో స్పష్టం చేయాలి. రాష్ట్ర ప్రయోజనాల పట్ల కేంద్ర వైఖరిని దాచి కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం తగదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. విద్యా, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పాలన సాగుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నవనీత, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, ఓబీసీ నాయకులు నందిమల్ల చంద్రమౌళి, యూత్ కాంగ్రెస్ నాయకులు శివకుమార్ నాయుడు, పాండు సాగర్, NSUI నాయకులు జస్వంత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు నిరంతర పని కల్పించాలి

**- ఫారం పాండ్ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 2 (విజన్ ఆంధ్ర) : ఉపాధి హామీ (వీబీజీ రామ్ జీ) పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను అభివృద్ధి చేయడంతో పాటు అర్హులైన కూలీలందరికీ నిరంతర ఉపాధి కల్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. గోపాల్‌పేట మండల పరిధిలోని గోపాల్‌పేట, మున్ననూరు గ్రామాల్లో బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. అక్కడ చేపడుతున్న నీటి కుంట (ఫారం పాండ్) పనులను పరిశీలించి, పనుల పురోగతితో పాటు కూలీల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మంజూరైన పనులను త్వరితగతిన గ్రౌండింగ్ చేసి పూర్తి చేయాలన్నారు. లేబర్ మొబిలైజేషన్ పెంచి గరిష్ఠ సంఖ్యలో కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ, ఎంపీడీఓ, ఏపీఓ, పథకం అధికారులు, గ్రామస్థులు, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుక



మల్కాజిగిరి, సెప్టెంబర్ 2, (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకను బుధవారం వినాయక నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకుడు గుత్తి రామచందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజక వర్గం ఇన్ చార్జ్ బద్దం పరుశురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి తినిపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నందికంటి శ్రీధర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తి రామచం దర్, చంద్రమౌళి, అంజయ్య, ఎం ఆర్ శ్రీనివా స్ యాదవ్, కృష్ణమూర్తి గౌడ్, ఫరీద్ , శేఖర్ గౌడ్, సాయి ముదిరాజ్, పేపర్ శీను, ఉమేష్, రంజిత్,సాయిరాం, వెంకటేష్ చారి, సాయి, స్వామి, లక్ష్మి, అరుంధతి, సత్యలక్ష్మి తదిత రులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్ స్కూల్ అక్రమాలపై విచారణ జరపాలి - బీఎస్ఎఫ్ డిమాండ్



ములుగు సెప్టెంబర్ 02; ములుగులోని బ్రిలియంట్ హైస్కూల్ అక్రమాలపై విచారణ జరపాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చారు. ఒకచోట అనుమతి పొంది మరోచోట స్కూల్ నడపడం, రెసిడెన్షియల్ విద్యార్థులను ప్రేమ్ నగర్ లోని వివేకవర్ధిని స్కూల్ లోకి తరలించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. ఆ ప్రాంగణంలో ఫైర్ సేఫ్టీ, భద్రతా ప్రమాణాలు లేవని, సరిపడా మరుగుదొడ్లు, తాగునీరు లేదని, టీచర్ల అర్హతలు, బస్సుల ఫిట్ నెస్ పై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. విచారణ జరిపి అక్రమాలు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# మా 1000 రోజుల అభివృద్ధికి.. మీ పదేళ్ల పాలనకు చర్చకు సిద్ధమా?

**- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సవాల్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) వనపర్తి నియోజకవర్గంలో రూ.2,389 కోట్లతో చేపట్టిన అభివృద్ధి, ఆరు గ్యారెంటీల అమలుపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమ 1000 రోజుల పాలనపై, ప్రతిపక్షాల పదేళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

***అభివృద్ధి లెక్కలు & ప్రాజెక్టుల పురోగతి***

నియోజకవర్గంలో రూ.2,389 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపటామని, ఆరు గ్యారంటీలకు సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. భూసేకరణ పెండింగ్ బకాయిల కోసం రూ.182 కోట్లు చెల్లించామన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల (ఖు×) పథకంలో 90 శాతం పనులు ముగిశాక మిగిలిన 10 శాతం చేసి మొత్తం తామే చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే 45 వేల ఎకరాలకు నీరందించే పనులు వేగవంతమయ్యాయని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి, వెలిగొండ ప్రాజెక్టులపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు.

***ఆరోపణలపై ఆలయ వేదికగా సవాల్***

తనపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలను తిప్పికొడుతూ "నా డబ్బులు పందికొక్కులు తిన్నారో లేదో తేల్చుకుందాం.. వెంకటేశ్వరస్వామి గుడికి రావడానికి నేను సిద్ధం, మీరు సిద్ధమా?" అని సవాల్ విసిరారు. 39 గుంటల భూమి కొనుగోలు వ్యవహారంలో నిజాలను జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

***ఉపాధి, సంక్షేమంలో మార్పు***

గత ప్రభుత్వంలో వేలాది పాఠశాలలు మూతపడ్డాయని, కనీసం కొత్త రేషన్ కార్డులు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత లోటుపాట్లను సరిదిద్ది 76 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని వివరించారు.

***ప్రతిపక్షాలు ఆత్మపరిశీలన చేసుకోవాలి***

డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేసిన అప్పులకు భారీగా వడ్డీలు చెల్లిస్తూనే, ఇరిగేషన్‌కు, సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రతిపక్ష నేతలు మాట్లాడే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# మహిళల పారిశ్రామిక పురోగతికే 'ర్యాంప్'

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**- వీ-హబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**






వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) : మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ ఆధ్వర్యంలోని 'వీ-హబ్' సౌజన్యంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'ర్యాంప్‌ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు 'ర్యాంప్' కార్యక్రమం చక్కటి అవకాశమని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ సహకారాన్ని వినియోగించుకొని తమ ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలను సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రపంచ బ్యాంకు, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (మీవీజు) మంత్రిత్వ శాఖ సంయుక్త సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వీ-హబ్ సీనియర్ డైరెక్టర్ జాహీద్ అక్తర్ షేక్, డైరెక్టర్ ఊహ తెలిపారు. మహిళల ఆధ్వర్యంలో నడిచే వ్యాపార సంస్థల సామర్థ్యాన్ని పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. జౌళి, ఆహార శుద్ధి, తయారీ, హస్తకళల రంగాల్లో ఉన్న వారికి వ్యాపార నిర్వహణ, నాణ్యతా ప్రమాణాలు, బ్రాండింగ్, మార్కెటింగ్‌లో నిపుణులతో శిక్షణ ఇప్పించడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణ అనుసంధానం కల్పిస్తామని వివరించారు. అనంతరం స్థానిక మహిళా పారిశ్రామికవేత్తలు తయారు చేసిన ఉత్పత్తులను అధికారులు పరిశీలించారు. పథకం ప్రయోజనాలు పొందేందుకు ఆసక్తి చూపిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రామ మహేశ్వర్, ఆర్‌సెటి డైరెక్టర్ అనిల్, అడిషనల్ డీఆర్‌డీఓ, వీ-హబ్ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పుతో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

**- ఆస్పత్రులకు క్యూ కడుతున్న జనం**






గ్రామాల నుంచి పట్టణ ఆస్పత్రులకు




తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 02: తెలంగాణలో వాతావరణంలో వచ్చిన ఒక్కసారి మార్పుతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. వర్షం పడకపోయినా వాతావరణంలో చల్లదనం పెరగడం, రాత్రి పగలు ఉష్ణోగ్రతల్లో తేడాలతో పిల్లల నుంచి పెద్దల వరకు రోగాల బారిన పడుతున్నారు. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా పసిపిల్లలు, చిన్నారులు సర్ది, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. పెద్దల్లో మలేరియా, డెంగ్యూ కేసులు కూడా పెరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

***రాత్రిపూట చలితో ఇబ్బందులు***

తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో నామమాత్రపు జల్లులు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నాయి. అయితే వర్షం లేని ప్రాంతాల్లో కూడా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాత్రిపూట చల్లగా మారడంతో పిల్లలకు, పెద్దలకు జలుబు, దగ్గు, జ్వరం మొదలవుతున్నాయి. చిన్నారులు రాత్రంతా దగ్గుతో ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పసిపిల్లల ఆరోగ్యం క్షీణించడంతో వివిధ గ్రామాల నుంచి తల్లిదండ్రులు పట్టణాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఆస్పత్రుల వద్ద పిల్లలను చూపించేందుకు క్యూ కడుతున్నారు. తినడం, నిద్రపోవడం మాని పిల్లలకు వైద్యం చేయిస్తున్నారు. వైద్యులు మాత్రం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చల్లటి పదార్థాలకు దూరంగా ఉంచాలని, వేడి నీళ్లు తాగించాలని, జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# బోథ్ లో గర్జించిన బి ఆర్ ఎస్



ఆదిలాబాద్ డెస్క్, సెప్టెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : బోథ్ నియోజవర్గ కేంద్రం లో బి ఆర్ ఎస్ పార్టీ కాంగ్రెస్ యొక్క అబ్బద్దపు హామీల పైన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరసన కార్యక్రమం లో భాగంగా బోథ్ నియోజవర్గ కేంద్రం లో బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ ఆధ్వర్యం లో బి ఆర్ ఎస్ గర్జించి నిరసన తెలిపారు బోథ్ లోని 7 మండల బి ఆర్ ఎస్ కార్యకర్తలు అధిక మొత్తం లో హాజరు అయ్యారు బోథ్ బస్టాండ్ లో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ మాట్లాడుతూ నియోజవర్గ కేంద్రం లో బి ఆర్ ఎస్ పార్టీ కాంగ్రెస్ యొక్క అబ్బద్దపు హామీల పైన ను మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు ప్రజలకు "బాకీ కార్డులు" అందజేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను, వాటి అమలులో వైఫల్యాలను ఎత్తిచూపారు. అనంతరం 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ బాకీ కార్డుతో సెల్ఫీ దిగుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై వినూత్న రీతిలో నిరసన తెలిపారు ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారుప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. హామీల అమలులో విఫలమైన ప్రభుత్వాన్ని ప్రజల ముందు ఎండగట్టడమే బీఆర్ఎస్ పోరాటం" అని పేర్కొన్నారు ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా, బోథ్ నియోజకవర్గ ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం మరింత ఉధృతం చేస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించే వాళ్ళు బోథ్ కు వచ్చి 100 పడకల ఆసుపత్రి చూడాలన్నారు. కచ్చితంగా బోథ్ రెవెన్యూ డివిజన్ కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ వర్ధంతి - సీతక్క నివాళులు



ములుగు సెప్టెంబర్ 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన తెలుగు రాష్ట్రాల చరిత్రలో సంక్షేమ స్వర్ణయుగంగా నిలిచిపోయిందన్నారు. 2004 నుండి 2009 వరకు పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలు కోట్ల మంది జీవితాలను మార్చాయన్నారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 సేవలు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, 2 రూపాయలకే బియ్యం, వృద్ధాప్య పింఛన్లు వంటి పథకాలతో ఆయన చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. భౌతికంగా దూరమైనా ఆయన పథకాలు నేటికీ తెలుగు ప్రజల గుండెల్లో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోయగూడెంలో పీపుల్స్ చిల్డ్రన్ పాఠశాల ప్రారంభించిన మంత్రి సీతక్క



ములుగు సెప్టెంబర్ 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గోవిందరావుపేట మండలం కోయగూడెంలో పీపుల్స్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన పాఠశాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పేద విద్యార్థుల కోసం పీపుల్స్ చిల్డ్రన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేసి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

# 6 గ్యారంటీలు ఏమయ్యాయి?

**- ములుగులో బీఆర్ఎస్ భారీ ర్యాలీ**




ములుగు సెప్టెంబర్ 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ ములుగులో బీఆర్ఎస్ భారీ ర్యాలీ, రాస్తారోకో చేపట్టింది. మండల మాజీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో 2 వేల మందితో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మణరావు, నియోజకవర్గ ఇంఛార్జ్ నాగజ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు మాట తప్పుతున్నారని లక్ష్మణరావు విమర్శించారు. హామీలు అమలు అయ్యే వరకు పోరాటం ఆగదన్నారు.

# ములుగులో ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు



ములుగు సెప్టెంబర్ 02, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కేంద్రంలో శ్రావణ బుధవారం సందర్భంగా పోచమ్మ తల్లికి బోనాల కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. శివసత్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష చేసి జక్కుల భవాని ఇంటి వద్ద ప్రత్యేక బోనం వండారు. భాజాభజంత్రీల నడుమ వివర్స్ కాలనీ నుండి ములుగు పురవీధుల గుండా నృత్యాలు చేస్తూ పోచమ్మ గుడికి బయలుదేరారు. పట్టణ వాసులు సుఖసంతోషాలతో ఉండాలని, వ్యాపారాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. 2 గంటల పాటు పూనకాలతో, విన్యాసాలతో బోనం ఎత్తుకుని నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ రాష్ట్ర అధ్యక్షురాలు లెజెండ్ ఓరుగంటి లైలా, శివసత్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజా నాయకుడు వైఎస్ఆర్.

**- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.**



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర : ప్రజా సంక్షేమమే పరమావధిగా జీవితాంతం పనిచేసిన మహోన్నత నాయకుడు, దార్శనిక ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఘన నివాళులు అర్పించారు. సంగారెడ్డి తన నివాసంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి వైయస్సార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సింగూర్ సాగునీరు రైతాంగానికి అందించేందుకు చేసిన సేవలు ప్రాంత రైతుల గుండెల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేయడంలో రాజశేఖర్ రెడ్డి గారు ఎంతో నిబద్ధత చూపించారు అని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. "పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, సామాజిక సంక్షేమం వంటి అనేక రంగాల్లో ఆయన చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ప్రజల సంక్షేమం కోసం డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు చూపిన అంకితభావం, ప్రజాసేవా స్ఫూర్తి నేటికీ మనకు మార్గదర్శకం. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, పేదలు మరియు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి." అని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ లో బిగ్ ఫైట్

**- ఢిల్లీలో రేవంత్ వర్సెస్ సురేఖ**

**- తెలంగాణ కాంగ్రెస్ లో ఇప్పుడు ఒక్కటే హాట్ టాపిక్.**

**- మంత్రి కొండా సురేఖ వర్సెస్ సీఎం రేవంత్ రెడ్డి.**



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 02: అసలు కథ ఏంటంటే... సురేఖ కూతురు చేసిన వ్యాఖ్యలతో పార్టీలో దుమారం రేగింది. సురేఖపై వేటు పడుతుందని, క్యాబినెట్ నుంచి తొలగిస్తారని ప్రచారం జరిగింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులు ఉత్తమ్, తుమ్మల, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్ అంతా ఢిల్లీకి క్యూ కట్టారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు కూడా ఢిల్లీ బయలుదేరడంతో అసలు సినిమా ఢిల్లీలోనే నడుస్తోంది. అయితే ఇక్కడే ట్విస్ట్ వచ్చింది. సురేఖపై చర్యలు తీసుకోవద్దంటూ ఇద్దరు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇద్దరు మంత్రులు, ఒక అగ్రనేత అధిష్టానానికి లేఖలు రాశారట. ఆమెను తొలగిస్తే ఆమె రాజీనామా చేస్తుందని, ఉప ఎన్నిక వస్తుందని, బీసీల నుంచి వ్యతిరేకత వస్తుందని ఖర్గే, వేణుగోపాల్ కు చెప్పారట. దీంతో అధిష్టానం కూడా యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈలోపు సురేఖ మాత్రం ఫుల్ ఫైర్ మోడ్ లోకి వెళ్లిపోయింది. చిట్ చాట్ లో రేవంత్ పై సంచలన వ్యాఖ్యలు చేసింది. "నాపై చర్యలు తీసుకునే ముందు రేవంత్ పై తీసుకోవాలి. పదేళ్లు తానే సీఎం అని చెప్పుకోవడం క్రమశిక్షణ కాదా? రేవంత్ తీరుపై చాలా మంది మంత్రులు అసంతృప్తిగా ఉన్నారు. పొంగులేటి, భట్టి భార్య కమీషన్లపై ఫిర్యాదులు వచ్చాయి, వాటిపై ఎందుకు మాట్లాడరు? రెడ్లు మాట్లాడితే చర్యలు లేవా? బీసీకి ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయమా?" అని ఫైర్ అయ్యింది. తన కూతురి విషయంలో "నా కూతురిని రేవంతే రెచ్చగొట్టాడు, అందుకే అలా మాట్లాడింది. దానికి నాపై చర్యలు వద్దు" అని క్లారిటీ ఇచ్చింది. చివరిగా తన రాజీనామా గురించి అసలు బాంబ్ పేల్చింది. "ఇప్పటివరకు అధిష్టానం నన్ను రాజీనామా చేయమని అడగలేదు. రేవంత్ ఒత్తిడికి అధిష్టానం బర్తరఫ్ చేస్తే చేసుకోనివ్వండి. నేను మాత్రం రాజీనామా చేయను, చేసే ప్రసక్తే లేదు" అని తేల్చి చెప్పింది. దీంతో ఇప్పుడు బంతి అధిష్టానం కోర్టులో పడింది. రేవంత్ మాట వింటుందా? సురేఖకు మద్దతుగా నిలుస్తుందా? అనేది వేచి చూడాలి.






# 22- ఏ చట్టం అంటే ఏమిటి...!!

**- అటవీ, చెరువుల పరిరక్షణ**

**- దేవాదాయ భూములకు రక్షణ**

**- అమ్మకాలు, రుణాలకు అడ్డంకులు**

**- ఆర్థిక ఇబ్బందుల్లో బాధితులు**

*ప్రభుత్వ ఆస్తుల రక్షణకు 22- ఏ కవచం.. అక్రమ భూ లావాదేవీలకు అడ్డుకట్ట.. కానీ అమలులో లోపాలతో సామాన్యుల సొంత భూములకూ చిక్కులు.. అసలు 22- ఏ ఎవరి కోసం? ప్రజలకు మేలా.. ఇబ్బందులా?... విజన్ ఆంధ్ర స్పెషల్ స్టోరీ*

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22- ఏ అనేది ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ మరియు అసైన్డ్ భూముల అక్రమ విక్రయాలను అడ్డుకోవడానికి ఉద్దేశించిన నిషేధిత జాబితా. తెలంగాణ రాజకీయాల్లో, ప్రజల ఆస్తుల లావాదేవీల్లో ఇది నిత్యం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది.




### 22- ఏ: ప్లస్ (ప్రయోజనాలు)!!

ప్రజా ఆస్తుల రక్షణలో ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువులు, కుంటలు వంటి ప్రజా వనరులు కబ్జాకు గురికాకుండా రిజిస్ట్రేషన్ వ్యవస్థ వద్దే అడ్డుకట్ట వేస్తుంది. దేవాదాయ, వక్ఫ్ భూముల పరిరక్షణలో మతపరమైన, ధార్మిక ట్రస్టుల భూములను దళారులు నకిలీ పత్రాలతో అమ్మేయకుండా ఈ నిబంధన నిరోధిస్తుంది.

### నిరుపేదలకు భద్రత

పేదలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను భూస్వాములు, రియల్టర్లు తక్కువ ధరకు లాక్కోకుండా చట్టపరమైన రక్షణ కల్పిస్తుంది. మోసాల నియంత్రణలో వివాదాస్పద లేదా కోర్టు పరిధిలో ఉన్న ఆస్తులను కొనుగోలు చేసి సామాన్య ప్రజలు మోసపోకుండా రిజిస్ట్రేషన్ సైట్లలోనే ముందస్తు హెచ్చరికగా పనిచేస్తుంది.

### 22- ఏ: మైనస్ (సమస్యలు మరియు లోపాలు)!!

### సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు

రెవెన్యూ రికార్డుల్లో లోపాల వల్ల లేదా అధికారుల నిర్లక్ష్యంతో తరతరాలుగా వస్తున్న ప్రైవేట్ పట్టా భూములు కూడా 22- ఏ జాబితాలో చేరిపోతున్నాయి.

### ఆస్తులు అమ్ముకోలేని పరిస్థితి

అత్యవసర వైద్య ఖర్చులు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం భూములు, ఇళ్లు అమ్ముకుందామన్నా లేదా బ్యాంకు రుణాలు తీసుకుందామన్నా రిజిస్ట్రేషన్ ఆగిపోయి ప్రజలు ఆర్థిక సంక్షోభంలో పడుతున్నారు. అవినీతికి ఆస్కారం 22- ఏ నుంచి తమ భూమిని తొలగించుకునేందుకు (డి-నోటిఫికేషన్) దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల నుంచి కలెక్టరేట్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు, దళారులు భారీగా లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### కోర్టు కేసులు పెరగడం

ఏళ్ల తరబడి రెవెన్యూ యంత్రాంగం సమస్యను పరిష్కరించకపోవడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించాల్సి వస్తోంది.

### ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణలు!!

### భూదందా అండ్ రియల్ మాఫియా

ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకులు విలువైన భూములను తక్కువ ధరకు కొట్టేసేందుకే కావాలని ప్రైవేట్ భూములను 22- ఏ జాబితాలో పెడుతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

### రైతులపై దాడి

ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పేద రైతుల పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చి వారిని రోడ్డున పడేస్తున్నారని మండిపడుతున్నాయి.







### దళారుల రాజ్యం

22- ఏ నుంచి భూమిని తప్పించాలంటే ఎకరాకు లేదా గజానికి ఇంత అని రేటు ఫిక్స్ చేసి అధికార పార్టీ అనుకూల దళారులు వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రతిపక్ష నేతలు నిలదీస్తున్నారు.

### ప్రభుత్వ ప్రతినిధుల వాదనలు, సమాధానాలు

ఆస్తుల పరిరక్షణే లక్ష్యంలో ప్రభుత్వ, దేవాదాయ ఆస్తులను కొల్లగొట్టే అక్రమార్కుల ఆట కట్టించడానికే ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది.

### గత పాలకుల తప్పిదాల సవరణ

గత ప్రభుత్వాల హయాంలో జరిగిన భూ రికార్డుల గందరగోళం వల్లే కొన్ని ప్రైవేట్ భూములు సాంకేతిక కారణాలతో జాబితాలోకి వచ్చాయని, వాటిని సరిచేసే పనిలో ఉన్నామని స్పష్టం చేస్తున్నారు.

### ప్రత్యేక డ్రైవ్‌లు

అర్హులైన నిజమైన పట్టాదారులకు అన్యాయం జరగకుండా రెవెన్యూ సదస్సులు, ప్రత్యేక గ్రీవెన్స్ విభాగాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తప్పులను వేగంగా సరిదిద్దుతున్నామని ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం రూపొందించిన 22- ఏ నిబంధన విధానపరంగా సరైనదే అయినప్పటికీ, అమలులో సాంకేతిక లోపాలు, పారదర్శకత లోపించడం వల్ల సామాన్య ప్రజలకు తలనొప్పిగా మారింది. అర్హులైన రైతులు, సామాన్యుల భూములను వేగవంతమైన డిజిటల్ విచారణ ద్వారా ఈ జాబితా నుంచి తక్షణమే తొలగించినప్పుడే ఈ చట్టం నిజమైన లక్ష్యం నెరవేరుతుంది.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# పర్వతగిరి గ్రామపంచాయతీలో కార్యదర్శి అక్రమాల పుట్ట!

**- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అనుమానాస్పద ధ్రువీకరణ పత్రాలు**

**- ఒకరు ఇద్దరు కాదు.. పదుల సంఖ్యలో బాధితులు ఉన్నారంటున్న గ్రామస్థులు**

**- కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్**



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్02(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి గ్రామపంచాయతీలో కార్యదర్శి వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామపంచాయతీ అనుమతులు, ఇంటి నంబర్లు, హద్దుల నిర్ణయం, ఇంటి పన్ను క్లియరెన్స్ తదితర అంశాల్లో నిబంధనలకు విరుద్ధంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారనే ఆరోపణలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దీంతో గ్రామపంచాయతీ రికార్డుల నిర్వహణపై గ్రామస్థుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లకు ఇతర ఇళ్ల నంబర్లను ఉపయోగించి హద్దులు నిర్ణయించడం, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వంటి వ్యవహారాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఇప్పటికే ఫిర్యాదులు, వివరణలు కోరుతున్న పరిస్థితుల్లోనే మరో కీలకమైన పత్రాల వ్యవహారం బయటపడింది.

### 2024లో ఒకరి పేరు.. 2025లో మరొకరి పేరు?

వెలుగులోకి వచ్చిన పత్రాల ప్రకారం.. 2024లో వేరే వ్యక్తి పేరుపై రిజిస్ట్రేషన్ జరిగిన ఇంటి నంబర్‌కు సంబంధించి, 2025లో గతంలో ఉన్న వ్యక్తి పేరుతో ఇంటి పన్ను క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ రికార్డుల్లో ఒకరి పేరు ఉండగా, అనంతరం అదే ఇంటి నంబర్‌కు సంబంధించి గత యజమాని పేరుతో పన్ను క్లియరెన్స్ ఎలా జారీ అయింది? ఈ ప్రక్రియలో సంబంధిత రికార్డులను ఎవరు పరిశీలించారు? ఏ ఆధారాలపై ధ్రువీకరణ పత్రం జారీ చేశారు? అనే ప్రశ్నలు గ్రామస్థుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### రికార్డుల భద్రతపై అనుమానాలు

ఒకటి తర్వాత మరొకటి ఇలాంటి పత్రాలు వెలుగులోకి వస్తుండటంతో పర్వతగిరి గ్రామపంచాయతీ రికార్డుల భద్రత, నిర్వహణ, ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ పెరుగుతోంది. ఈ వ్యవహారాల్లో కేవలం ఒక్కరు, ఇద్దరు మాత్రమే బాధితులు కాదని, పదుల సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పాత ఇంటి నంబర్లు, కొత్త నిర్మాణాలు, పన్ను రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పంచాయతీ అనుమతులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు అంటున్నారు.

### కలెక్టర్ దృష్టి సారించాలి

పర్వతగిరి గ్రామపంచాయతీలో గత కొంతకాలంగా వెలుగులోకి వస్తున్న ఈ ఆరోపణలపై వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణకు ఆదేశించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామపంచాయతీకి సంబంధించిన పాత రికార్డులు, ఇంటి పన్ను రిజిస్టర్లు, ఇంటి నంబర్ల కేటాయింపు రికార్డులు, నిర్మాణ అనుమతులు, హద్దుల ధ్రువీకరణ పత్రాలు, పన్ను క్లియరెన్స్ సర్టిఫికెట్లు తదితర రికార్డులను ఉన్నతాధికారుల ఆధీనంలోకి తీసుకుని పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తప్పు చేసిన పర్వతగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి సల్లూరి రఘు సిబ్బంది ఎవరైనా ఉంటే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితుడు నాగుల రాజు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి!

**- వనపర్తి ఎంసీహెచ్ ఆస్పత్రిలో ఘటన**

**- వారం రోజుల్లో విచారణ పూర్తికి సూపరింటెండెంట్ హామీ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ (ఎంసీహెచ్) ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే నవజాత శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### అసలేం జరిగింది?

శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జి.స్వాతి తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్న సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంది. ఆరోగ్య సమస్యలేవీ లేవని వైద్యులు ధ్రువీకరించడంతో ప్రసవం కోసం ఆగస్టు 30న ఆమెను ఎంసీహెచ్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, ఆస్పత్రిలో తీవ్ర నొప్పులు వచ్చి ఉమ్మనీరు పోతున్నప్పటికీ సంబంధిత వైద్యులు సరైన సమయంలో ఎలాంటి వైద్య నిర్ణయం తీసుకోలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి విషమిస్తుండటంతో సిజేరియన్ చేయాలని తాము ఎంత వేడుకున్నా సిబ్బంది స్పందించలేదని ఆరోపించారు. ఆగస్టు 31వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో ప్రసవం పూర్తయిందని చెబుతూ, మృత శిశువును తమ చేతికి అప్పగించారని బాధిత కుటుంబం కన్నీరుమున్నీరైంది. శిశువు మృతికి గల కారణాలపై ఆస్పత్రి వర్గాలు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలిపారు.



### బాధ్యులను సస్పెండ్ చేయాలని సూపరింటెండెంట్‌కు వినతి

ఈ ఘటనకు బాధ్యులైన వైద్యులు, వైద్య సిబ్బందిపై పూర్తిస్థాయి విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రమోహన్, ఆర్ఎంఓ డాక్టర్ శివప్రసాద్‌లకు బాధితులు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి, వాస్తవాలను వెలుగులోకి తెచ్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### ఆందోళన బాట పడతామని హెచ్చరిక

బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఈ పోరాటాన్ని ఆపేది లేదని, ఒకవేళ విచారణలో జాప్యం జరిగితే ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం, శివకుమార్, చెన్నా రాయుడు, పద్మ, కేతూరి బుడ్డన్న, అన్వేష్, గజరాజుల తిరుమలేష్, రమేష్, గంధం ప్రవీణ్, రాజేష్, సత్యనారాయణ, చంద్రశేఖర్ గౌడ్, ప్రవీణ్, భాస్కర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.

# కల్వకుర్తిలో ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు

**- బోనాలలో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**- ఆలయ అభివృద్ధికి రూ. 5 లక్షల విరాళం ప్రకటన**





కల్వకుర్తి, సెప్టెంబర్ 02 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి పట్టణంలో శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి .ఓ .ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.

**- ఆలయ అభివృద్ధికి రూ. 5 లక్షల సహకారం**

భక్తుల సౌకర్యార్థం శ్రీ పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయం వద్ద రేకుల షెడ్ నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయలు) చెక్ రూపకంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు రేకుల షెడ్ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆలయ కమిటీ కోరిక మేరకు ఈ సహకారం అందించానని, ఆలయాల అభివృద్ధికి తన తోడ్పాటు ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని ఈదమ్మ, మాంధాత బోనాల ఉత్సవాల్లో కూడా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు రాఘవేందర్ రెడ్డి గారి సేవా భావాన్ని అభినందిస్తూ, ఆలయ అభివృద్ధికి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో రెండో రోజు అంగరంగ వైభవంగా

# పోచమ్మ తల్లి బోనాలు

**పట్టణమంతా అమ్మవారి నామస్మరణతో మార్మోగింది!**

**తెలంగాణ స్టేట్ బ్యూరో,సెప్టెంబర్ 02, (విజన్ ఆంధ్ర):**

కల్వకుర్తి పట్టణమంతా బుధవారం అమ్మవారి భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. రెండో రోజు పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడ చూసినా బోనం కుండలు, నెత్తిన బోనాలతో ఆడపడుచులు, డప్పు వాయిద్యాలు, అమ్మవారి భక్తి గీతాలతో పట్టణం మొత్తం జాతరను తలపించింది.



ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరిస్తున్న టీం సభ్యులు...



అందమైన అలంకరణలో పోచమ్మ తల్లి...

బోనాల పండుగ అంటేనే ఆడపడుచులకు అత్యంత ప్రత్యేకమైన పండుగ. అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు బోనం కుండకు బొట్లు పెట్టి, అందులో పరమాన్నం, బూరెలు నైవేద్యంగా పెట్టి, అలంకరించుకుని డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. అచ్చం అదే భక్తిభావంతో కల్వకుర్తి ఆడపడుచులు బోనాలను పోచమ్మ తల్లికి సమర్పించారు.



టీం సభ్యులతో పాటు చిందులు వేస్తున్న ఎమ్మెల్యే....

**హైదరాబాద్ తరహాలో తొలిసారి పవర్ ? ఫుల్ టీం ఆధ్వర్యంలో వేడుకలు**

ఈసారి బోనాల్లో ప్రత్యేక ఆకర్షణగా కల్వకుర్తి పట్టణానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన 'పవర్ ఫుల్ టీం' నిలిచింది. ఆషాడ మాసంలో హైదరాబాద్ లో జరిగే విధంగా అంగరంగ వైభవంగా బోనాలను నిర్వహించాలని తొలిసారిగా ఈ యూత్ టీం సంకల్పించింది. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా అమ్మవారి రూపాన్ని తీసుకొచ్చి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి ఒక త్రిశూలాన్ని కూడా బహుకరించారు.

ఈ వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ విజితా రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం, యద్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ తో పాటు పట్టణ నాయకులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన వారికీ టీం సభ్యులు శాలువాలతో సన్మానం చేశారు



పోతురాజులతో చిందులు వేస్తున్న నాయకులు



పాత అమ్మవారు ప్రాణ ప్రతిష్ట... 8 నెలల తర్వాత

అనంతరం డప్పు వాయిద్యాలకు చిందులు వేస్తున్న యువకులతో పాటు ఎమ్మెల్యే కసిరెడ్డి కూడా డాన్స్ చేసి సందడి చేశారు అలాగే మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పోతురాజులతో చిందులు వేశారు.



ఇంద్రానగర్ కాలనీ నుంచి బోనాలతో వస్తున్న మహిళలు...

**ప్రతి వార్డు నుంచి పోటెత్తిన బోనాలు**

కల్వకుర్తి పట్టణంలోని ప్రతి వార్డు నుంచి పెద్ద ఎత్తున మహిళలు బోనాలు తీసుకొని పోచమ్మ తల్లికి సమర్పించారు. అలాగే పట్టణంలోని కోట మైసమ్మ తల్లికి కూడా బోనాలను సమర్పించారు. ముందుగా కోట మైసమ్మ తల్లికి బోనం, పోచమ్మ తల్లికి బోనం సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

**మహిమగల తల్లిగా పోచమ్మ తల్లి - కొబ్బరికాయ మొలకెత్తిన అద్భుతం**

పోచమ్మ తల్లిని ఇక్కడి ప్రజలు మహిమగల తల్లిగా కొలుస్తారు. దీనికి నిదర్శనంగా ఒక అద్భుత ఘటనను భక్తులు చెబుతున్నారు. నూతన దేవాలయం నిర్మించేటప్పుడు అమ్మవారి కింద ఉన్న మట్టిని తీసుకుని, అందులో ఒక కొబ్బరికాయను పెట్టి ఒక డబ్బాలో మూత మూసి ఉంచారట. మామూలుగా కొబ్బరికాయ రెండు మూడు రోజుల్లో కుళ్లిపోతుంది. కానీ ఆ డబ్బా మూత ఎగిరిపోయి, ఆ కొబ్బరికాయ నుంచి మొలక వచ్చి కొబ్బరి చెట్టుగా బయటకు రావడంతో సాక్షాత్తు అమ్మవారే అక్కడ కొలువై ఉందని భక్తులు నమ్ముతున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన భక్తులు ఆశ్చర్యపోయి అమ్మవారిపై మరింత భక్తిని పెంచుకున్నారు.

**పలారం బండ్లు, తొట్టెల వేడుకలతో సందడి**

ఈ బోనాల్లో పట్టణానికి చెందిన క్రాంతి కుమార్ అమ్మవారికి త్రిశూలాన్ని బహుకరించగా, బలరాం నగర్ కాలనీకి చెందిన యువకులు తొట్టెల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో చాలాచోట్ల యువత పలారం బండ్లు, తొట్టెల వేడుకలతో ఉత్సవాలకు మరింత శోభ తెచ్చారు. ఆడపడుచులు అందంగా అలంకరించుకుని బోనం కుండలను నెత్తిన పెట్టుకుని, డప్పు వాయిద్యాలు, శివశక్తుల ఆటపాటలతో, వీధుల వెంట, ప్రధాన రహదారులలో నాట్యాలు ఆడుతూ ఊరేగింపుగా పోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి, మళ్లీ సంవత్సరం పాడిపంటలు బాగా పండాలని, కుటుంబంలో సుఖసంతోషాలు ఉండాలని మొక్కుకున్నారు. చివరి రోజు బోనాలు కావడంతో రాత్రి 10 గంటల వరకు బోనాల సమర్పణ కొనసాగింది.

# కాంగ్రెస్‌ను నమ్మితే ఆగం కావడమే

**- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**- పాలించే నైతికత రేవంత్ రెడ్డికి లేదు**

**- రాజీవ్ చౌరస్తాలో బిఆర్ఎస్ సమరభేరి**



వనపర్తి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర)( కాంగ్రెస్ పార్టీని నమ్మితే ఆగం అవుతామని నాడు కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షరాలా నిజమయ్యాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనా వైఫల్యాలపై రాజీవ్ చౌరస్తాలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన సభ నిర్వహించారు. ఈ నిరసన సభలో పాల్గొన్న మహిళలు, ప్రజలను ఉద్దేశించి నిరంజన్ రెడ్డి ఘాటుగా మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు, 11 డిక్లరేషన్లలో ఏ ఒక్కటీ నెరవేరలేదని దుయ్యబట్టారు. 100 రోజుల గడువు అని చెప్పి 1000 రోజులైనా హామీలు నెరవేర్చకపోగా పత్రికల్లో భారీ ప్రకటనలు ఇస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్, సకాలంలో ఎరువులు అందేవని.. నేడు యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ నీటి వాటాను పొరుగు రాష్ట్రం దోచుకెళ్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిద్ర నటిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులు, నిరుద్యోగుల మోసం: 100 రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను వంచించారని, ఉద్యోగులు, వృద్ధులు (4000 పింఛన్ ఆశ చూపి) అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభా స్థలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను వివరిస్తూ ప్రదర్శించిన 420 ఫీట్ల భారీ ఫ్లెక్సీ సభికులను విశేషంగా ఆకర్షించింది. నిరసనకు వెల్లువలా తరలివచ్చిన మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సంక్షేమ పాలన మళ్లీ రావడం తథ్యమని నిరంజన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, బి.లక్ష్మయ్య, నందిమల్ల అశోక్, లక్ష్మారెడ్డి, కృష్ణా నాయక్, గంధం పరంజ్యోతి, రాజానగరం విజయ్ కుమార్, వెంకట్ సాగర్, కె.మాణిక్యం, వివిధ మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మరియు కేడర్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐఐటీ విద్యార్థులకు 100 స్కాలర్‌షిప్‌లు

**- ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 : ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు అసోం ప్రభుత్వం తరపున ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందించాలని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐఐటీ గువాహటి 33వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, ఈ స్కాలర్‌షిప్ పథకానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను తక్షణమే సిద్ధం చేయాలని ఐఐటీ గువాహటి డైరెక్టర్ సహా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐఐటీ గువాహటి కేవలం విద్యా సంస్థ మాత్రమే కాదని.. అసోంతో పాటు మొత్తం ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సవాళ్లకు ఆధునిక పరిష్కారాలు కనుగొనడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే వేదికపై విద్యార్థుల మానసిక ఒత్తిడిని ఉద్దేశించి సీఎం హిమంత బిశ్వ శర్మ ఇచ్చిన సందేశం అందరినీ ఆకట్టుకుంది. జీవితం అనేది అందరి కంటే ముందుండాలనే పరుగుపందెం కాదని, ఒకవేళ అందరికంటే వేగంగా వెళ్లలేకపోయినా ఎవరూ వెనుకబడిపోయినట్లు భావించాల్సిన అవసరం లేదని విద్యార్థులకు హితవు పలికారు. చదువుతో పాటు వ్యక్తిగత సమతుల్యతను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

# బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

**- అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**- బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**- పెండింగ్ కేసులను సమీక్షించి సమగ్ర నివేదిక సమర్పించాలి**



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర): జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బాలల సంక్షేమం, రక్షణకు సంబంధించిన ప్రతి కేసును తీవ్రంగా పరిగణించి, వారి భద్రత, విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా బాలల సంక్షేమం, రక్షణ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, బిక్షాటనకు గురవుతున్న పిల్లల సమస్యలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. బాల్య వివాహానికి సంబంధించి హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు పోలీసులతో కలిసి ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. బాల్య వివాహం జరిగే అవకాశం ఉన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే అడ్డుకోవాలని సూచించారు. ఇప్పటికే వివాహం జరిగితే నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచాలని స్పష్టం చేశారు. ఒకసారి ఫిర్యాదుపై చర్యలు తీసుకున్న తర్వాత కేసును వదిలేయకుండా, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఫిర్యాదు చేసిన బాలుడు లేదా బాలిక తిరిగి సంప్రదింపులకు రాకపోతే పోలీసుల సహకారంతో వారిని గుర్తించి, పరిస్థితిని తెలుసుకుంటూ ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నివారణలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే వారు వ్యక్తిగతంగా ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని పరిశీలించడంతో పాటు డీసీపీవో కార్యాలయం, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గతంలో నమోదైన బాల్య వివాహాలు, బాల కార్మికులు, బిక్షాటనకు సంబంధించిన పెండింగ్ కేసులను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, ప్రస్తుత పరిస్థితి, కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలతో కూడిన సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను సూచించారు. బాల కార్మికులు, బిక్షాటనకు గురవుతున్న పిల్లలను రక్షించిన అనంతరం వారి విద్యాభ్యాసానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫిర్యాదుల కోసం ఎదురుచూడకుండా అధికారులు ప్రోయాక్టివ్‌గా వ్యవహరించి బాలల హక్కులు, సంక్షేమాన్ని కాపాడాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జెడ్‌పీసీఈఓ ఇంచార్జి డీపీఓ వెంకట రెడ్డి, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, డీడబ్ల్యూఓ జరీనా బేగం, డీఎంహెచ్‌ఓ డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారులు, కార్మిక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ మహిళ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి గర్వించదగ్గది

**- మంత్రి అజహారోద్దిన్**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 2, ( విభజన ఆంధ్ర ): మైనార్టీ మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేసినటువంటి కృషి గర్వించదగ్గదని మైనార్టీ సంక్షేమం మరియు ప్రభుత్వ రంగ స్థల శాఖ మంత్రివర్యులు మహమ్మద్ అజాహారోద్దిన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నాడు ఇందిరమ్మ మైనార్టీ మహిళ యోజన పథకం కింద మైనారిటీ వర్గాలకు చెందిన నిరాశ్రయులు, విడాకులు పొందిన వారు,



అనాథలు, వితంతువులు, అవివాహితలు, ఒంటరి మహిళలకు, చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వము మైనారిటీ మహిళలకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయల చొప్పున 278 మంది మహిళలకు మొత్తం రూ. 1,39,00,000/- ఒక కోటి 39 లక్షల రూపాయలను ఆర్థిక సహాయము కింద అందజేశారని ఆయన కొనియాడారు. దుర్గా కాషా ముస్లిం కమ్యూనిటీ స్టోర్ కటింగ్ మిషన్లు ఇవ్వడం జరిగిందన్నారు ఒక్కొక్క కటింగ్ మిషన్ విలువ 60 వేల రూపాయలు చొప్పున 13 టూల్ కిట్లను జనరేటర్లును ఆయన చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్పు పట్నం మహేందర్ రెడ్డి,శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపొడి గాంధీ, రాజేందర్ నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షాద్నగర్ ఎమ్మెల్యే కే శంకరయ్య, ఎమ్మెల్సీ బొగరాపు దయానంద్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్ల కొత్వాల్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎల్ బీ కె కిరణ్మయి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కే నవీన్ కుమార్ రెడ్డి, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.